PRABHATA SURYA

ప్రభాత సూర్య

తెలుగు దిన పత్రిక

www.suryaa.news

వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 16 జూలై 2025 సంపుటి: 01, సంచిక : 69

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


### కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్

**హైదరాబాద్:** తెలంగాణ బీజేపీ నేతలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ వ్యాఖ్యలకు పొన్నం కౌంటరిచ్చారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి వచ్చే నిధులను ఆయనే ఆపుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీ బీసీల చాంపియన్. గుడ్డుకు వెంట్రుక కట్టే పని పెట్టుకోవద్దని బీజేపీ నేతలకు విజ్ఞప్తి చేస్తున్నాం. బీజేపీ నేతలు అరవింద్, బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, కృష్ణయ్య గారు బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలని కోరుతున్నాం. తెలంగాణ కుల గణన విప్లవాత్మక నిర్ణయమని స్వయానా వారణాసి ప్రజా ప్రతినిధి (ఆర్ఎస్ఎస్)నేత నాతో అన్నారు. బీజేపీ నేతలు దుర్బుద్ధిని వీడండి.


విలేకరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.

96667 32777

ప్రభాత సూర్య

www.suryaa.news


# చైనా ప్లస్ వన్‌గా తెలంగాణ



- మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో
- రాష్ట్ర అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సహకరించాలి
- "రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను అభివృద్ధి చేయాలని కృషిచేస్తున్నాం
- అందుకనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం.
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఐకర్ బయాలజిక్స్ కొత్త యూనిట్‌కు శంకుస్థాపన

**సూర్య న్యూస్ హైదరాబాద్**

"మేము కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పోటీపడడం లేదు. ప్రపంచ దేశాలతో పోటీ పడుతున్నాం. 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేటలోని జీనోమ్ వ్యాలీలో 'ఐకర్ బయాలజిక్స్' కొత్త యూనిట్ భూమిపూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొత్త యూనిట్ శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్

- మిగతా2లో



## కళ్లలో కారం చల్లి కాల్చి చంపారు

- సీపీఐ నేత చందు రాథోడ్ దారుణ హత్య..
- అతి సమీపం నుంచి కాల్పులు.. అక్కడికక్కడే కుప్పకూలిన వైనం
- హైదరాబాద్‌లో ఘటన
- హత్యలో నలుగురు పాల్గొన్నట్లు ఆధారాలు
- రంగంలోకి దిగిన పది ప్రత్యేక బృందాలు

## శుభప్రదం.. జయప్రదం!



- క్షేమంగా భూమికి తిరిగొచ్చిన శుభాంశు.. మరో ముగ్గురు వ్యోమగాములు
- సాఫీగా సాగర జలాల్లో దిగిన డ్రాగన్ వ్యోమనౌక
- యాక్సియం-4 రోదసియాత్ర దిగ్విజయం
- భారత ఆస్ట్రోనాట్‌కు అభినందనల వెల్లువ



## గతేడాది 357 మంది మావోల మృతి

- చనిపోయిన వారిలో పార్టీసానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ వరకు..
- నక్సల్బరీ పోరాటంలోగతేడాది భారీ నష్టాలు
- గెరిల్లా యుద్ధతంత్రంలో కొత్త ఎత్తుగడల అమలుకు శ్రీకారం
- వెలుగులోకి వచ్చిన మావోయిస్టు కేంద్ర కమిటీ డాక్యుమెంట్



## 5 నెలలు.. రూ.7వేల కోట్లు

- భారతీయుల నుంచి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తం
- ఓటీపీ, డిజిటల్ స్కాం, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లతో స్వాహా
- వివిధ దేశాలకు చెందిన సైబర్ నేరాలకు వివిధ దేశాలకు చెందిన వారు పాల్పడుతున్నారని హోంశాఖ గుర్తించింది.

## బనకచర్ల వద్దు.. తెలంగాణ సర్కారు లేఖ

- నేటి సీఎంల భేటీ ఎజెండాను సవరించండి..
- కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్ర సర్కారు లేఖ
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనతో అప్రమత్తం
- అనుమతులే లేని ప్రాజెక్టుపై చర్చ
- అసమంజసమంటూ తీవ్ర అభ్యంతరం
- చట్టాలు, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ ఆ ప్రాజెక్టు చేపట్టారని వెల్లడి
- ఇప్పటికే గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని లేఖలో ప్రస్తావించిన సీఎస్
- డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి
- తెలంగాణ ప్రతిపాదనలే ఎజెండాలో చేర్చాలని స్పష్టీకరణ



**సూర్య న్యూస్ హైదరాబాద్**

తెలంగాణ, ఏపీ మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశం ఎజెండాలో గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతులు లేని ప్రాజెక్టుపై చర్చ అసమంజసమని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనే లేదని, వెంటనే ఎజెండాను సవరించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం కేంద్ర జలశక్తి శాఖ

- మిగతా2లో

## 19న సీజే ప్రమాణస్వీకారం


### నేడు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్‌కు వీడ్కోలు



**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ఈ నెల 19న ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో శనివారం మధ్యాహ్నం 12.30కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. దీంతో ఆయన ఏడో సీజేగా బాధ్యతలు చేపడతారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గత సీజే జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బదిలీపై బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా

- మిగతా2లో



## వాటికి సొంతింట్లో తిండి పెట్టొచ్చుగా?

- ఆ కుక్కలకు వీధుల్లో ఎందుకు ఆహారం అందిస్తున్నారు?
- వీధికుక్కలకు ఫీడింగ్ పాయింట్లు ఏర్పాటుచేయాలన్న పిటిషనర్‌పై సుప్రీం అభ్యంతరం
- ఇప్పటికే వీధిశునకాలు సమస్యగా మారాయని మండిపాటు

## పంటల బీమా వచ్చేనా?

- ఇంకా ఖరారు కాని విధివిధానాలు
- 2024 వానాకాలం నుంచే ఇస్తామన్న సీఎం
- ఇప్పటికే రెండు పంటలకు మొండిచెయ్యి
- గత ఏప్రిల్‌లో మంత్రి తుమ్మల సమావేశం
- నెలలు గడుస్తున్నా అతీగతీ లేని విధివిధానాలు
- క్రాప్ బుకింగ్ తరువాతే నిర్ణయిస్తామంటున్న అధికారులు



**సూర్య న్యూస్ హైదరాబాద్**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా... పంటల బీమా పథకం అమలుపై ఇప్పటివరకు మార్గదర్శకాలు రూపొందించలేదు. బీఆర్ఎస్ హయాంలో రద్దయిన పంటల బీమా పథకాన్ని 2024 వానకాలం సీజన్‌లోనే పునః ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. గత రెండు సీజన్లలో పంటల బీమాపై అడుగు ముందుకు పడలేదు. రాష్ట్రంలో వానకాలం సీజన్ ప్రారంభమై ఇప్పటికే 60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఈసారైనా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తారా లేదా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. పంటల

- మిగతా2లో

# కళ్లలో కారం చల్లి కాల్చి చంపారు

హైదరాబాద్/మలక్‌పేట

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ అలియాస్ చందు నాయక్ (50) దారుణ హత్యకు గురయ్యారు. హైదరాబాద్ మలక్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని శాలివాహననగర్ పార్కులో వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తుండగా దుండగుల కాల్పుల్లో చనిపోయారు. కళ్లలో కారం చల్లిన నిందితులు అతి సమీపం నుంచి కాల్పులు జరపడంతో ఆయన శరీరంలోకి మూడు తూటాలు దూసుకుపోయాయి. ఈ హత్యలో నలుగురు ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు.. పరోక్షంగా సహకరించిన వారి వివరాలు ఆరా తీస్తున్నారు. మూడేళ్ల క్రితం ఎల్బీనగర్ ఠాణాలో నమోదైన హత్య కేసులో చందు నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీకారం, భూ వివాదాలతోపాటు వివాహేతర సంబంధం కోణాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, హతుడి కుటుంబీకులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

**వసూళ్లు అడ్డుకోవడంతో వివాదాలు**

నాగర్‌కర్నూల్ జిల్లా నర్సాయిపల్లికి చెందిన చందు.. భార్య నారీబాయి, కుమారుడు సిద్ధు, కుమార్తె సింధులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని విద్యుత్‌నగర్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం సిద్ధు కెనడాలో ఎంటెక్ చదువుతుండగా... సింధు గ్రూప్స్‌కు సన్నద్ధమవుతోంది. చందు విద్యార్థి దశలో ఎస్ఎఫ్ఐలో, కార్మిక నాయకుడిగా సీఐటీయూలో పని చేశారు. ఎల్బీనగర్ ఏరియా సీపీఎం నాయకుడిగా నాగోల్ శ్రీ సాయినగర్‌లోని స్థలాల్లో పేదలతో గుడిసెలు వేయించారు. 2010లో సీపీఐలో చేరి భూపోరాటం చేసి పట్టాలు ఇప్పించారు. సీపీఐ (ఎంఎల్) నాయకుడు రాజేష్ తో కొన్నాళ్లుగా చందుకు విభేదాలున్నాయి. కుంట్లూర్ రావినారాయణరెడ్డి నగర్‌లోని మూడెకరాల భూమిలో గుడిసెలు వేసుకున్న వారి నుంచి రాజేష్ తదితరులు డబ్బులు వసూలు చేస్తుండటాన్ని చందు అడ్డుకున్నారు. దీంతో రాజేష్ , సుధాకర్, మున్నా, రాయుడుతో కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి.

**వాకింగ్ చేసిన పార్కు బయటే...**

రాజేశ్‌తోపాటు మరికొందరు సోమవారం రాత్రి కారులో చందు ఇంటి సమీపంలో సంచరించడాన్ని



నారీబాయి గమనించి చందును హెచ్చరించారు. మంగళవారం ఉదయం భార్య, కుమార్తెతో కలిసి చందు శాలివాహననగర్ పార్కులో వాకింగ్ చేశారు. 7.30 గంటల ప్రాంతంలో బయటకు రాగా.. అక్కడే కారులో రాజేష్ కనిపించడంతో నారీబాయి హెచ్చరించారు. 'నాకేం కాదు. ఏం భయం లేదు. మీరు ఇంటికి వెళ్లండి'అంటూ భార్య, కుమార్తెను పంపేశాడు. పార్కు వెస్ట్ గేట్ నుంచి కుడి వైపు రోడ్డులో కారు వద్దకు వెళ్తుండగా అందులోంచి దిగిన ఇద్దరు చందు కళ్లలో కారం కొట్టారు. అప్రమత్తమైన ఆయన తప్పించుకోవడానికి వెనక్కు పరిగెత్తగా.. పార్కు గేటు వద్ద ఉన్న ఇసుకలో కాలు జారి పడిపోయారు. సమీపంలోకి వచ్చిన ఇద్దరు పిస్టల్‌తో అతని ఛాతీ, పొట్ట భాగాల్లో కాల్చారు. రక్తం మడుగులో ఉన్న అతడిని కాలుతో వెనక్కు తిప్పి తలపై మరో రౌండ్ కాల్చి కారులో పారిపోయారు.

**సెల్ఫ్ డ్రైవింగ్ కారు అద్దెకు తీసుకుని...**

ఘటనాస్థలి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా దుండగులు స్విఫ్ట్ (టీఎస్ 08 హెచ్‌డబ్ల్యూ 0875) కారులో వచ్చినట్లు గుర్తించారు. ఇది పీర్జాదిగూడకు చెందిన ఓ మహిళ పేరుతో రిజిస్టరై ఉంది. ఆమె దీన్ని కొత్తపేట కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఓ సెల్ఫ్ డ్రైవింగ్ కార్ ఏజెన్సీకి కాంట్రాక్టుకు ఇచ్చారు. సోమవారం ఆన్‌లైన్‌లో ఆ కారును బుక్ చేసుకున్న ఏడుకొండలు అనే వ్యక్తి తీసుకుని వెళ్లారు. అతడితోపాటు రాజేష్ , ప్రశాంత్, మరొకరు ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏడుకొండలు కారు తీసుకెళ్లి అద్దెకు ఇచ్చిన సంస్థకు అప్పగించి పారిపోయారు. క్లూస్ టీమ్ ఘటనాస్థలిలో మూడు ఖాళీ క్యాట్రిడ్జ్‌లు, రెండు పేలని తూటాలను స్వాధీనం చేసుకుంది. పేలింది నాటు తుపాకీ అని, తూటాలు 7.65 ఎంఎం క్యాలిబర్‌కు చెందినవిగా తేల్చారు.

**భానుచందర్ హత్య కేసులో నిందితుడు...**

చందు 2022లో జరిగిన రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి పదిర భానుచందర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. భూ వివాదాల నేపథ్యంలో నాగోలుకు చెందిన భాను చందర్‌ను, మన్సూరాబాద్‌కు చెందిన సీపీఐ నాయకుడు కందుల సుధాకర్, చందు తదితరులు ఆ ఏడాది ఏప్రిల్ 16న కిడ్నాప్ చేశారు. యాదాద్రి జిల్లా తిరుమలగిరి వద్ద అతడిని హత్య చేసి మృతదేహాన్ని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ సమీపంలో పడేశారు. ఈ కేసులో పోలీసులు చందుతోపాటు మిగిలిన నిందితులను అరెస్టు చేశారు.

**రంగంలోకి పది ప్రత్యేక బృందాలు**

హత్య విషయం తెలిసిన వెంటనే సౌత్‌ఈస్ట్ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అదనపు డీసీపీ కె.శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఘటనాస్థలికి వచ్చారు. సీపీఐ నాయకులు అజీజ్‌పాషా, ఈటీ నర్సింహా, ఛాయాదేవి తదితరులు ఘటనాస్థలికి తరలివచ్చారు. చందు భార్య, కుమార్తె మృతదేహం వద్ద కన్నీరు మున్నీరయ్యారు. ఏడాదిన్నర నుంచి చందుకు ప్రాణహాని ఉందని రాజేష్ తదితరులే చంపారని ఆమె ఆరోపించారు. చందు మృతితో నాగర్‌కర్నూల్ జిల్లాలోని స్వగ్రామం నర్సాయిపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి.

చందు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. నిందితులను పట్టుకోవడానికి పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని చైతన్య కుమార్ చెప్పారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెంటల్ ఏజెన్సీ నుంచి నిందితులు వాడిన కారును స్వాధీనం చేసుకున్నారు.

# గతేడాది 357 మంది మావోల మృతి

భద్రాద్రి కొత్తగూడెం

గతేడాది కాలంలో సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు వరకు మొత్తం 357 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) పేరిట గత జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. అందులోని వివరాల ప్రకారం...బూటకపు ఎన్‌కౌంటర్లలో 80 మంది చనిపోయారని, మొత్తంగా చనిపోయిన వారిలో 136 మంది మహిళలు ఉన్నారని, ఎదురుకాల్పులు కాకుండా అనారోగ్య కారణాలతో నలుగురు, ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 23 మంది జిల్లా కమిటీ సభ్యులు, 83 మంది ఏరియా కమిటీ, 138 మంది పార్టీ సభ్యులు, పీఎల్‌జీఏ 17, ఇతర విభాగాల వారు 40, గుర్తించని మృతులు 36 మంది ఉంటారని వివరించింది. వీరి త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది.

**చుట్టుముట్టి చంపుతున్నారు**

నక్సల్బరీ విప్లవ పోరాటం మొదలైన తర్వాత ఆపరేషన్ కగార్‌తో ఏడాది వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో సెంట్రల్, స్టేట్ కమిటీ సభ్యులను కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పార్టీ సెంట్రల్ కమిటీ పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్ (29 మంది మావోయిస్టులు చనిపోయారు) తర్వాత సగటున ప్రతీ 20 రోజులకు ఒక భారీ ఎన్‌కౌంటర్ జరుగుతోందని, ఈ ఘటనల్లో కనిష్టంగా 10 నుంచి గరిష్టంగా 35 మంది వరకు మావోయిస్టులు చనిపోయారని తెలిపింది. 20 కిలోమీటర్ల వలయాకారంలో వేలాది మంది భద్రతాదళాలు చుట్టుముడుతూ తమపై దాడులు చేస్తున్నాయని, ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ గల భద్రతా దళాలను తమ కేడర్ ప్రాణాలకు తెగించి ఎదుర్కొంటోందని ఆ డాక్యుమెంట్‌లో పేర్కొంది.

**నిజాలు దాస్తున్నారు**

ప్రతీ ఎదురుకాల్పుల ఘటనలో భద్రతాదళాల వైపు కూడా పది మందికి మించి జవాన్లు చనిపోతున్నారని సెంట్రల్ కమిటీ తెలిపింది. తమకున్న అంచనా ప్రకారం ప్రతిదాడుల్లో 70 మంది జవాన్లు చనిపోగా, 130 మంది తీవ్రంగా గాయపడి ఉంటారని అభిప్రాయపడింది. అయితే ఈ విషయాన్ని దాచి పెడుతూ కేవలం మావోయిస్టుల మరణాల లెక్కలనే పాలకులు బయటకు వెల్లడిస్తున్నారని విమర్శించింది. దీర్ఘకాలిక సాయుధ పోరాటంలో ఎత్తుపల్లాలు సహజమేనని వివరణ ఇచ్చింది. అంతర్జాతీయ వ్యవహారాలపై కూడా ఈ డాక్యుమెంట్‌లో కేంద్ర కమిటీ తమ అభిప్రాయాలను తెలిపింది.

**అనువైన సమయం కోసం**

గెరిల్లా యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలను సరైన రీతిలో అమలు చేయనందుకే పార్టీకి నష్టాలు పెరిగాయని సీసీ వివరణ ఇచ్చింది. 2024 ఆగస్టులో పొలిట్‌బ్యూరో తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకురాబోతున్నట్టు పేర్కొంది. వర్గ పోరాటాన్ని వికేంద్రీకరించి అటవీ, గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని సీసీ స్పష్టంగా పేర్కొంది. పెరిగిన నిర్బంధం, పార్టీకి వరుసగా జరుగుతున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ విస్తరణ వీచేగాలిలా, ప్రవహించే నీరులా ఉండాలని కేడర్‌కు కేంద్ర కమిటీ సూచించింది. శత్రువు బలంగా ఉన్నప్పుడు ఎదురుగా నిలిచి పోరాటం చేయనక్కర్లేదని, అనువైన సమయం కోసం ఎదురుచూడాలని ఆదేశించింది. శాంతి చర్చలు జరపాలంటూ 9 రాష్ట్రాల నుంచి డిమాండ్ రావడం ఇటీవల కాలంలో కనిపించిన సానుకూల పరిణామమని ఆ పార్టీ పేర్కొంది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్రం చేసిన ప్రకటన ఎప్పటికీ నెరవేరబోదని ధీమా వ్యక్తం చేసింది.

## చైనా ప్లస్ వన్‌గా తెలంగాణ

-మొదటిపేజీ తరువాయి

ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కార్యాచరణను అమలు చేస్తున్నాం. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను అభివృద్ధి చేయాలని కృషిచేస్తున్నాం. అందుకనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నాం. చైనా ప్లస్ వన్‌గా తెలంగాణను తీర్చిదిద్దనున్నాం. ప్రపంచ దేశాలన్నీ కూడా భారత్ వైపు చూస్తున్నాయి. దేశంలోనూ తెలంగాణను పెట్టుబడుల్లో అగ్రభాగాన నిలపాలన్నది మా లక్ష్యం. ఇందుకు జీనోమ్ వ్యాలీ పారిశ్రామికవేత్తల సహకారం ఉండాలని కోరుతున్నా. ఫార్మా, లైఫ్‌సైన్సెస్, ఐటీ, ఈవీ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని మాట ఇస్తున్నా.

**ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు...**

2000 సంవత్సరంలో ప్రారంభించిన జీనోమ్ వ్యాలీ కారణంగా.. 25 ఏళ్లలో ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంది. ఇక్కడ స్థాపించిన పరిశ్రమలు, ఇక్కడ పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలు అహర్నిశలు కృషిచేయడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి ప్రపంచంలోనే ఒక గుర్తింపు లభించింది. దేశంలోనే వ్యాక్సిన్ ఉత్పత్తిలో 33 శాతం, బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి అవుతున్నాయంటే.. ఇక్కడి పారిశ్రామికవేత్తలు ఎంత నిబద్ధతతో పనిచేస్తున్నారో అర్థమవుతుంది. జీనోమ్ వ్యాలీ నుంచే కొవిడ్ వ్యాక్సిన్లను తయారుచేసి.. ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలది. ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదు. పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే ప్రభుత్వాల నిర్ణయాలు ఉన్నాయి. పరిశ్రమలకు ఇచ్చే అనుమతులు, ప్రోత్సాహకాలు, విధానపరమైన నిర్ణయాల విషయంలో మా ప్రభుత్వం మరింత సరళంగా ముందుకెళ్తుంది. ఈ దేశంలోకి.. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి వేగంగా పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పంటల బీమా వచ్చేనా?

-మొదటిపేజీ తరువాయి

బీమాకు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో చేరాలా లేక సొంతంగా రాష్ట్రంలో బీమా పథకాన్ని రూపొందించాలా? అనేది ప్రభుత్వం తేల్చుకోలేకపోతోంది.

**మూడు నెలలైనా ముందుకు పడని అడుగు**

పంటల బీమా పథకానికి విధి విధానాలు రూపొందించాలని ఏప్రిల్ 23వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కానీ, ఇప్పటివరకు వ్యవసాయ శాఖ దానిని పట్టించుకోనే లేదు. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో మంత్రి సమావేశమైనప్పటికీ బ్యాంకర్లు పంటల బీమాపై ఆసక్తి చూపలేదు. దీంతో ప్రధాని ఫసల్ బీమా పథకంలోనే చేరాలని సూత్రప్రాయంగా నిర్ణయించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని గతంలో అమలు చేశారు. 2018%–%19 సీజన్ తరువాత ఈ పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది.

**11 క్లస్టర్లుగా రాష్ట్రం**

రాష్ట్రంలో పంటల బీమాను పునరుద్ధరించాలంటే ఫసల్ బీమా ఒక్కటే సరైనదిగా రాష్ట్ర ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించి బీమా అమలు చేయాలని నిర్ణయించారు. వానకాలం సీజన్‌లో సుమారు 132 లక్షల ఎకరాల్లో పంటలు, యాసంగిలో 78 లక్షల ఎకరాల్లో వేస్తారని లెక్క కట్టారు. ఈ నేపథ్యంలో ఫసల్ బీమా పథకం మార్గదర్శకాల ప్రకారంగా వానకాలానికి మొత్తం ప్రీమియంలో రైతు వాటా కింద 2 శాతం, యాసంగిలో 1.5 శాతం.. వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం రైతు వాటాగా తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలిన ప్రీమియంలో రాష్ట్రం, కేంద్రం 50:50 చొప్పున భరిస్తాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో ఈసారి వరి సాగు మందగించింది. కాగా, పంటలు వేసిన తరువాత క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ చేపడతారు. అంటే ఏ పంటను ఏ రైతు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే లెక్కలను రూపొందిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతే పంటల బీమా పథకం అమలు ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయశాఖలోని ఒక కీలక అధికారి తెలిపారు.

## 19న సీజే ప్రమాణస్వీకారం

-మొదటిపేజీ తరువాయి

వెళ్లిన నాటి నుంచి సీజే పోస్టు ఖాళీగానే ఉంది. సీజే నియామకానికి గత మేలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేయడంతో రెండు రోజుల క్రితం రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఇదిలాఉండగా, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన రాష్ట్ర హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్‌కు బుధవారం ఫుల్‌కోర్టు ఘన వీడ్కోలు పలకనుంది. బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు ఫస్ట్‌కోర్టు హాల్‌లో జరిగే వీడ్కోలు సమావేశంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొననున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ సుజోయ్‌పాల్ 2024, మార్చి 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి 21 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై కోల్‌కతా హైకోర్టుకు వెళ్లనున్నారు.

# బనకచర్ల వద్దు.. తెలంగాణ సర్కారు లేఖ

-మొదటిపేజీ తరువాయి

కార్యదర్శికి లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాసిన ఈ లేఖలో బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అభ్యంతరాలన్నింటినీ సీఎస్ ప్రస్తావించారు.

**బనకచర్లే సింగిల్ ఎజెండాగా ఏపీ ప్రతిపాదన**

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో ఈ సమావేశం జరగనుంది. అయితే ఈ భేటీ సింగిల్ (ఏకైక) ఎజెండాగా బనకచర్లపై మాత్రమే చర్చించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఏపీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ లేఖ రాసింది. తెలంగాణ చేసిన పలు ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చాలని కోరింది. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయ ప్రాజెక్టులుగా గుర్తింపు అంశాన్ని ఎజెండాలో చేర్చి చర్చించాలని ఇప్పటికే కేంద్రాన్ని రాష్ట్ర సర్కారు కోరింది. అలాగే తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు 80 టీఎంసీల నీటి కేటాయింపుతో పాటు ఏఐబీపీ పథకం కింద సాయం, గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు, నిధుల కేటాయింపు వంటి అంశాలను చేర్చాలని విజ్ఞప్తి చేసింది. తాజాగా ఇప్పుడు కూడా ఈ అంశాలపైనే చర్చించాలని సీఎస్ స్పష్టం చేశారు.

**ఆ సంస్థల విశ్వసనీయత దెబ్బతింటుంది..**

బనకచర్ల ప్రాజెక్టుపై గోదావరి బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర పర్యావరణ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ తీవ్ర అభ్యంతరాలు తెలపడాన్ని సీఎస్ గుర్తు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనేలేదని తేల్చి చెప్పారు. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తిరస్కరించిన విషయాన్ని ప్రస్తావించారు. సీడబ్ల్యూసీ కూడా ఈ రిపోర్టును తిరస్కరించాలని కోరారు. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలు ఇవే..**

పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా, అంగీకారం తీసుకోకుండా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రాలకు ట్రిబ్యునల్ జరిపిన నీటి కేటాయింపుల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రాజెక్టుల నిర్వహణలో సైతం మార్పులు చోటుచేసుకుంటాయి. ఏకపక్షంగా 200 టీఎంసీలను తరలించాలని చేసిన ప్రతిపాదనతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌లో మార్పులు జరగడంతో పాటు తెలంగాణ నీటి హక్కులకు విఘాతం కలుగుతుంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుకు అనుమతుల జారీకి సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ నుంచి క్లియరెన్స్‌లు అవసరం కాగా, బనకచర్ల ప్రాజెక్టుకు ఇవేమీ లేవు. ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టులో కీలకమైన సమాచార లోపాలున్నాయి. నీటి లభ్యత, సాంకేతిక సమాచారం లోపించింది. పోలవరం ప్రాజెక్టుతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే ముంపుపై ఇప్పటికే న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమయంలో ఈ ప్రాజెక్టును ఎలా చేపడతారు? ఈ ప్రాజెక్టు తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాలను హరిస్తుంది. ప్రధానంగా కరువు పీడిత ప్రాంతాలపై దుష్ప్రభావం చూపుతుంది.

**అన్ని ప్రక్రియలూ పూర్తైన తర్వాతే చర్చించాలి**

? చట్టబద్ధంగా రావాల్సిన అన్ని అనుమతులు, అంతర్రాష్ట్ర సంప్రదింపులు, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రక్రియలు పూర్తైన తర్వాతే ఈ ప్రాజెక్టుపై అయినా, ఏ సమావేశంలోనైనా చర్చ జరగాలి. ఆ తర్వాతే ప్రాజెక్టును ఆమోదించాలి. బనకచర్ల ద్వారా తరలించనున్న 200 టీఎంసీల గురించి పోలవరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రస్తావన లేదు. నీటి లభ్యత, అంతర్రాష్ట్ర ప్రభావాలపై సమగ్ర అధ్యయనంతో పాటు ట్రిబ్యునల్ తీర్పులను నికచ్చిగా అమలు చేస్తేనే ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) స్పష్టం చేసింది. బనకచర్ల ప్రాజెక్టుతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, 1980 ఏప్రిల్ 2న జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందం అమలు తీరులో మార్పులు చోటుచేసుకుంటాయని గోదావరి బోర్డు అభ్యంతరం తెలిపింది. ఎలాంటి మార్పులకైనా పరీవాహకంలోని అన్ని రాష్ట్రాల నుంచి తప్పనిసరిగా రాతపూర్వకంగా సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గోదావరి జలాల బట్వాడా విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎలాంటి ఒప్పందం లేదని కూడా తెలిపింది. 80 టీఎంసీలకు మించి జలాలను ఇతర బేసిన్లకు మళ్లిస్తే బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు వాటాలు ఇవ్వాలని కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పులు స్పష్టం




చేస్తున్నాయని తెలిపింది. గోదావరి ట్రిబ్యునల్ పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు కేటాయించిన నికర జలాల కోటాలను పూర్తిగా వాడుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ప్రాజెక్టులను నిర్మించిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుకు ప్రతిపాదించిన 200 టీఎంసీల లభ్యతపై స్పష్టత వస్తుందని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది. ప్రాజెక్టు గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని పేర్కొంటూ బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ నిరాకరించిన విషయాన్ని సైతం లేఖలో తెలంగాణ ప్రస్తావించింది. అన్ని రకాల అనుమతులు సాధించిన తర్వాతే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని కోరిందని తెలిపింది. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగే సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఇందుకోసం మంగళవారం రాత్రి వారు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సమావేశానికి హాజరైనప్పటికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్లపై చర్చకు ఒప్పుకునేది లేదని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ బనకచర్లను ఎజెండాలో పెట్టి చర్చ ప్రారంభిస్తే నిరసన వ్యక్తం చేస్తూ బాయ్‌కాట్ చేస్తారని తెలుస్తోంది. కాగా, వీలును బట్టి సీఎం బుధవారం రాత్రికి, లేదా గురువారం నగరానికి వస్తారని సీఎంవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

# శుభప్రదం.. జయప్రదం!

వాషింగ్టన్/ఢిల్లీ

భారత రోదసి చరిత్రలో ఒక కీలక అంకం దిగ్విజయంగా పూర్తయింది. స్వీయ మానవసహిత అంతరిక్షయాత్ర 'గగన్‌యాన్'కు మార్గం సుగమమైంది. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులపాటు గడిపిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా.. చిరునవ్వులు చిందిస్తూ భూమికి చేరుకున్నారు. 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత పౌరుడొకరు రోదసి యాత్రను పూర్తిచేసుకొని సగర్వంగా తిరిగొస్తున్న అద్భుత ఘట్టాన్ని వీక్షించి యావద్దేశం పులకించింది. గగనయాత్రికుడికి ఘన స్వాగతం పలికింది. నింగిని చుంబించి వచ్చిన కుమారుడిని టీవీలో చూసిన శుభాంశు తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లాతోపాటు పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు గత నెల 25న ఫ్లోరిడాలోని అంతరిక్ష కేంద్రం నుంచి నింగిలోకి బయల్దేరిన సంగతి తెలిసిందే. 28 గంటల ప్రయాణం తర్వాత.. 26న వారి వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానమైంది. అనంతరం 18 రోజుల పాటు ఈ వ్యోమగాములు రోదసిలో 60 ప్రయోగాలు నిర్వహించారు. ఇందులో భారత్‌కు సంబంధించిన 7 ప్రయోగాలను శుక్లా నిర్వహించారు. అక్కడి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ, విద్యార్థులు, శాస్త్రవేత్తలతో ముచ్చటించారు. 1984లో రాకేశ్ శర్మ రోదసియాత్ర చేశాక భారత వ్యోమగామి ఒకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే మొదటిసారి. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా, రోదసిలో అత్యధిక కాలం (ప్రయాణ సమయంతో కలిపి 20 రోజులు) గడిపిన భారతవాసిగా ఆయన రికార్డు సృష్టించారు. యాత్ర లక్ష్యాలను పూర్తిచేసుకున్న యాక్సియం-4 వ్యోమగాములు సోమవారం సాయంత్రం స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ గ్రేస్ వ్యోమనౌకలో తిరుగుప్రయాణమయ్యారు. గంటకు 28వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్న ఈ క్యాప్సూల్ రోదసిలో పలు విన్యాసాలు నిర్వహించింది. దశలవారీగా రాకెట్లను మండించడం ద్వారా వేగాన్ని తగ్గించుకొని భూవాతావరణంలోకి ప్రవేశించింది. చివర్లో పారాచూట్ల ద్వారా వేగాన్ని మరింత కట్టడి చేసుకొని భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 3.01 గంటలకు అమెరికాలోని కాలిఫోర్నియా తీరానికి చేరువలో పసిఫిక్ మహాసముద్రంలో దిగింది.



స్థానికంగా అది రాత్రి సమయం కావడంతో శక్తిమంతమైన లైట్ల వెలుగులో సహాయ బృందాలు బోట్ల సహాయంతో వ్యోమనౌకను చేరుకున్నాయి. దాన్ని వెలికితీసి స్పేస్‌ఎక్స్‌కు చెందిన రికవరీ నౌక 'షానన్'పైకి చేర్చాయి. అనంతరం డ్రాగన్ వ్యోమనౌక తలుపును తెరిచి.. వ్యోమగాములను బయటకు తెచ్చాయి. తొలుత విట్సన్ వెలుపలికి వచ్చారు. అనంతరం శుక్లా చిరునవ్వులు చిందిస్తూ, అభివాదం చేస్తూ బయటకు వచ్చారు. 20 రోజుల పాటు రోదసిలోని భారరహిత స్థితికి అలవాటుపడ్డ వ్యోమగాములు.. తిరిగి భూ గురుత్వాకర్షణ శక్తికి అనుగుణంగా సర్దుబాటు చేసుకోవడంలో ఇబ్బందిపడ్డారు. వారు నిలబడటానికి, నడవడానికి స్పేస్‌ఎక్స్ సిబ్బంది సాయపడ్డారు. వ్యోమగాములకు నౌకలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెలికాప్టర్‌లో తీరానికి తరలించారు. భూవాతావరణ పరిస్థితులకు అలవాటుపడటానికి వీరు ఏడు రోజులు పునరావాస శిబిరంలో గడుపుతారు.

**చరిత్రాత్మక యాత్ర: మోదీ**

యాక్సియం-4 మిషన్‌లో పైలట్‌గా శుక్లా పాత్రను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. దేశ అంతరిక్ష పరిశోధనల్లో, అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో ఒక కొత్త మైలురాయిని ఆయన స్థాపించారని చెప్పారు. చరిత్రాత్మక యాత్ర ముగించుకొని వచ్చిన శుభాంశుకు దేశ ప్రజలందరితో కలిసి స్వాగతం పలుకుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఆయన తన అంకితభావం, ధైర్యం, మార్గదర్శకత్వంతో కోట్లమంది భారతీయుల్లో స్ఫూర్తిని రగిలించారని కొనియాడారు. గగన్‌యాన్ యాత్ర దిశగా ఇదో ముఖ్య మైలురాయి అని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోంమంత్రి అమిత్ షా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజకీయ నేతలు శుక్లాకు అభినందనలు తెలిపారు.

**తల్లిదండ్రుల ఉద్వేగం..**

శుభాంశు తిరిగిరాక సందర్భంగా లఖ్‌నవూలోని సిటీ మాంటిస్సోరి స్కూల్‌లో ఉత్సాహం, ఉద్వేగంతో కూడిన వాతావరణం నెలకొంది. ఆయన విద్యాభ్యాసం ఈ పాఠశాలలోనే సాగింది. అక్కడ ఏర్పాటుచేసిన భారీ తెరపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులతోకలిసి శుభాంశు కుటుంబం యాక్సియం-4 తిరుగుప్రయాణాన్ని వీక్షించింది. యాత్ర సాఫీగా ముగియడంతో అందరూ ఊరట చెందారు. ఈ క్రమంలో భావోద్వేగానికి లోనైన శుక్లా తండ్రి శంభుదయాల్ శుక్లా, తల్లి ఆశాదేవి, సోదరి శుచి మిశ్రల కళ్ల వెంట ఆనందబాష్పాలు రాలాయి. అందరూ జాతీయ జెండాలను చేతబట్టి.. భారత్‌మాతాకీ జై అంటూ నినదించారు.

# కుయ్యో..మొర్రో అంటున్న కెనడా, బ్రెజిల్

**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తునన విధానాలు ఇటు అమెరికన్లతోపాటు అటు ప్రపంచ దేశాలకు నచ్చడం లేదు. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. తీసుకుంటన్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. వాణిజ్యం విషయం లో విధిస్తున్న టారిఫ్‌లతో ప్రపంచ వాణిజ్యంపై ప్రభావం చూపుతోంది. తమకు అనుకూలంగా లేని, తమ మాట వినని దేశాలపై ట్రంప్ భారీగా సుంకాలు విధిస్తున్నారు. తాజాగా బ్రెజిల్, కెనడాపై టారిఫ్ మోత మోగించాడు. కెనడాపై 35 శాతం సుంకం, ఇతర వాణిజ్య భాగస్వాములపై 15-20 శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించారు. ఇది ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈ నిర్ణయం కెనడాతో వాణిజ్య ఒత్తిడిని పెంచింది. ఇక బ్రిక్స్ సమావేశం, ప్రత్యేక కూటమి నేపథ్యంలో బ్రెజిల్‌పైనా 50 శాతం సుంకాలు విధించారు. దీంతో బ్రెజిల్‌లో అమెరికాకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.డొనాల్డ్ ట్రంప్ కెనడా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 35 శాతం సుంకం విధించనున్నట్లు ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రకటించారు. ఇది ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుంది. ఈ సుంకం గతంలో విధించిన 25 శాతం సుంకం కంటే అధికం. కెనడా ప్రతీకార సుంకాలు విధిస్తే ఈ రేటు మరింత పెరుగుతుందని ట్రంప్ హెచ్చరించారు. ఫెంటనిల్ డ్రగ్ దిగుమతులను నియంత్రించడంలో కెనడా విఫలమైందని, అమెరికా వాణిజ్య లోటును పెంచే వాణిజ్య విధానాలను అనుసరిస్తోందని ట్రంప్ ఆరోపించారు. ఈ సుంకం కెనడా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపనుంది. కెనడా ఎగుమతులలో 75 శాతం అమెరికాకు వెళ్తుంది. ట్రంప్ ఈ చర్య వాణిజ్య ఒప్పందాలను ఒత్తిడి చేయడానికి, ఫెంటనిల్ వంటి సమస్యలపై కెనడా నుంచి సహకారం రాబట్టడానికి ఒక వ్యూహంగా కనిపిస్తుంది.ఇక బ్రెజిల్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. దీంతో సావో పాలోలోని పాలిస్టా అవెన్యూలో వేలాది మంది




నిరసనకారులు ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేస్తూ, నినాదాలతో ఆందోళనలు నిర్వహించారు. ట్రంప్ విధానాలను ప్రజల శత్రుత్వంగా అభివర్ణించిన నిరసనకారులు, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారో విచారణకు సంబంధించి ట్రంప్ టారిఫ్‌లను రాజకీయ ఒత్తిడిగా భావిస్తున్నారు. 50 శాతం సుంకం బ్రెజిల్ ఎగుమతులను, ముఖ్యంగా ఉక్కు, అల్యూమినియం, వ్యవసాయ ఉత్పత్తులను తీవ్రంగా ప్రభావితం చేయనుంది. ఈ నిరసనలు ట్రంప్ వాణిజ్య విధానాలు కేవలం ఆర్థిక చర్యలు మాత్రమే కాక, రాజకీయ ఒత్తిడి సాధనంగా కూడా పనిచేస్తున్నాయని భావిస్తున్నారు.కెనడా ఇప్పటికే అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలను విధించింది. ట్రంప్ హెచ్చరికల ప్రకారం, కెనడా మరిన్ని సుంకాలు విధిస్తే, అమెరికా టారిఫ్‌లు మరింత పెరుగుతాయి. బ్రెజిల్ కూడా ప్రతీకార సుంకాలను పరిశీలిస్తోంది. ఇది గ్లోబల్ వాణిజ్యంలో అస్థిరతను పెంచనుంది. ఈ టారిఫ్‌లతో అమెరికా వినియోగదారులకు వస్తువుల ధరలు పెరగడం, ఆటోమొబైల్, ఉక్కు, అల్యూమినియం వంటి పరిశ్రమలపై ప్రభావం పడనుంది. ఇది వాణిజ్య యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది.గ్లోబల్ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితిని సృష్టిస్తుంది.

# ఆమెది ఆత్మహత్య కాదు.. భాజపా వ్యవస్థ చేసిన హత్య

**ఇంటర్నెట్‌డెస్క్:** లెక్చరర్ వేధింపులు భరించలేక కాలేజీ ప్రాంగణంలో నిప్పంటించుకొన్న యువతి మూడు రోజులు మృత్యువుతో పోరాడి మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఇది ఆత్మహత్య కాదు.. వ్యవస్థీకృత హత్య అని భాజపాపై మండిపడ్డారు. బాధితురాలిని రక్షించడంలో ఒడిశాలోని భాజపా ప్రభుత్వం విఫలమైందంటూ రాహుల్ మంగళవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'ఒడిశాలో న్యాయం కోసం బాధిత విద్యార్థిని ధైర్యంగా, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా తన గొంతుక వినిపించింది. అందుకు, ఆమెకు న్యాయం చేయడానికి బదులు.. బెదిరించి, హింసించారు. పదేపదే అవమానించారు. ఎప్పటిలాగే భాజపా వ్యవస్థ నిందితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తోంది. ఒక అమాయకురాలైన విద్యార్థిని తనకు తాను నిప్పంటించుకునేలా చేసింది. ఇది ఆత్మహత్య కాదు.. వ్యవస్థీకృత హత్య. మోదీజీ ఒడిశా లేదా మణిపుర్‌లో అయినా.. దేశంలో కుమార్తెలు కాలిపోతున్నారు, ప్రాణాలు కోల్పోతున్నారు. మీరు ఇంకా మౌనంగానే ఉంటారా?. దేశానికి మీ మౌనం అవసరం లేదు. వీటన్నింటికీ సమాధానాలు కావాలి. భారతదేశ మహిళలకు భద్రత, న్యాయం కావాలి' అని రాహుల్ రాసుకొచ్చారు. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న బాధిత విద్యార్థిని విభాగాధిపతి సమీర్‌సాహు కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తన మాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ ఎలాంటి పురోగతి కన్పించలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన బాధిత విద్యార్థిని కాలేజీ క్యాంపస్‌లోనే నిరసన చేపట్టింది. ఈక్రమంలోనే జూన్ 12న ఒక్కసారిగా ప్రిన్సిపల్ కార్యాలయానికి పరుగెత్తిన ఆమె.. అక్కడే ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. తోటి విద్యార్థులు ఆమెను రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం బాధితురాలిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా సోమవారం అర్ధరాత్రి ప్రాణాలు కోల్పోయింది.

## 5 నెలలు.. రూ.7వేల కోట్లు

న్యూఢిల్లీ

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కేవలం 5 నెలల వ్యవధిలో అక్షరాలా రూ.7వేల కోట్లను దేశ ప్రజల నుంచి కొట్టేశారు. దీనిని బట్టి చూస్తే మే-జూలై మధ్యలో సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తం రూ.10వేల కోట్ల వరకు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటీపీ ఫ్రాడ్ మొదలు డిజిటల్ స్కాం వరకు ఒక్కో వ్యక్తిని ఒక్కో రకంగా మోసం చేస్తున్న నేరగాళ్లు లక్షల రూపాయిలు కొల్లగొడుతున్నట్లు కేంద్రం గుర్తించింది. ఈ నేరాలు చేసే వారంతా ఆగ్నేయాసియా దేశాల వాళ్లు కాగా చేయించేది మాత్రం చైనీయులేనని నిఘా విభాగం స్పష్టం చేసింది.

**ఐ4సీ ఏం చెబుతోందంటే..**

దేశ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని వివిధ దేశాలకు చెందిన సైబర్ నేరాలకు వివిధ దేశాలకు చెందిన వారు పాల్పడుతున్నారని హోంశాఖ గుర్తించింది. వివిధ మార్గాల్లో డబ్బు కొట్టేస్తున్న వాళ్లంతా మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్‌లకు చెందిన వారేనని ఇండియన్ సైబర్ క్రైం కో%-%ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) డేటా తేల్చింది. వీరి వెనుక ఉన్నది మాత్రం చైనీయులేననేది ఐ4సీ స్పష్టం చేస్తోంది. నెలకు రూ. వెయ్యి కోట్ల వసూళ్లే లక్ష్యంగా వీరు అమాయకులను ఉచ్చులోకి దించుతున్నట్లు తెలిపింది.

**డబ్బంతా వెళ్లేది అటే..**

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) డేటా ప్రకారం దేశంలో జనం నుంచి కొట్టేసిన డబ్బంతా ఆగ్నేయాసియా దేశాలకు వెళుతున్నట్లు వెల్లడైంది. జనవరిలో రూ.1,192 కోట్లు, ఫిబ్రవరిలో రూ.951 కోట్లు, మార్చిలో రూ.1,000 కోట్లు, ఏప్రిల్‌లో రూ.731 కోట్లు, మేలో రూ.999 కోట్లు కొట్టేసినట్లు సమాచారం. ఓటీపీ ఫ్రాడ్స్, డిజిటల్ స్కాం, పోలీసులమని చెప్పి కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడటం, క్రిప్టో కరెన్సీ, లాటరీ స్కాం, క్రెడిట్ కార్డు పాయింట్స్ క్లెయిం, ఈ నెంబర్‌పై ఆఫర్ ఉంది కారు గిఫ్ట్‌గా వస్తుందని చెప్పడం, పెళ్లి చేసుకోవడానికి యూఎస్ నుంచి వస్తున్నట్లు నమ్మబలకడం, లింకులు పంపి డబ్బు కొట్టేయడం తదితర మార్గాల్లో జనం నుంచి లాగేస్తున్నారు.

**మన వాళ్లే ఏజెంట్లు**

సైబర్ నేరాల పేరుతో అమాయకుల నుంచి డబ్బు కొట్టేసేందుకు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో మనవాళ్లను ఏజెంట్లుగా నియమించుకోవడం గమనార్హం. ఇటీవల ఈ విషయాలు వివిధ రాష్ట్రాల పోలీసుల దర్యాప్తులు తేలాయి. మహారాష్ట్ర, తమిళనాడు, జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో వందల కొద్దీ ఏజెంట్లు సైబర్ నేరగాళ్ల సహకరిస్తున్నారు. చైనా నుంచి కీలక వ్యక్తుల సూచనలు..మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్‌లకు దేశాల నేరగాళ్ల ఆదేశాలతో మనవాళ్లు నేరాల్లో ప్రత్యక్షంగా భాగస్వాములుగా మారుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని, వీరి ఉచ్చులో పడొద్దని కేంద్రం పదేపదే హెచ్చరిస్తున్నా కేటుగాళ్లఉచ్చులో జనం పడుతుండటం గమనార్హం.

## వాటికి సొంతింట్లో తిండి పెట్టొచ్చుగా?

న్యూఢిల్లీ

వీధిశునకాలను ఎక్కడపడితే అక్కడ పెంచిపోషిస్తున్న కారణంగా కుక్కలున్న రోడ్లపై చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి దాపురించిందని సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. వీధి శునకాల కోసం ప్రత్యేకంగా ఆహారకేంద్రాలు తెరవాలంటూ పిటిషన్ దాఖలుచేసిన ఒక వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆయన తరపున హాజరైన న్యాయవాదిపై పలు ప్రశ్నలు సంధించింది. "వీధిశునకాల బాగోగులు పట్టించుకునే ఇలాంటి దయార్ద్ర హృదయుల కోసం కాలనీలోని ప్రతి రోడ్డును, ప్రతి సందును భోజనాల కోసం కేటాయించాలా?. ఆయన ఉండే కాలనీలోని వీధి శునకాలన్నింటికీ ఆయన సొంతింట్లోనే ఆహారం పెట్టొచ్చుగా?. ఎవ్వరూ ఆయనకు అడ్డుచెప్పరు"అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జంతువుల జనన నియంత్రణ నిబంధనలు, 2023లో 20వ రూల్ ప్రకారమే తమ ఏరియాలోని వీధిశునకాలకు క్లయింట్ ఆహారం పెడుతుంటే ఆయా కాలనీవాసులు, అపార్ట్‌మెంట్ యజమానులు అడ్డుచెబుతున్నారని, వేధిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. జనం పెద్దగా తిరగని ప్రాంతాల్లో ఫీడింగ్ పాయింట్లు ఏర్పాటుచేసేలా పురపాలికలను ఆదేశించాలని న్యాయవాది కోరారు. దీనిపై సుప్రీంకోర్టు మండిపడింది. "మేమొక మంచి సలహా ఇస్తాం. పిటిషనర్ ఇంట్లోనే ఒక షెల్టర్‌ను తెరవండి. అక్కడే ప్రతి ఒక్క వీధిశునకానికి ఆహార ఏర్పాట్లు చేసుకోండి"అని కోర్టు సూచించింది. గ్రేటర్ నోయిడాలో ఇలాంటి పాయింట్లు ఉన్నా నోయిడా సిటీలో లేవని న్యాయవాది వాదించడంతో కోర్టు మళ్లీ స్పందించింది. "మీరొక సైకిల్ తొక్కుతూ ఉదయం పూట అలా వెళ్లిరండి. వీధి శునకాలున్న రోడ్డులో ఏం జరుగుతుందో మీకే తెలుస్తుంది"అని కోర్టు వ్యాఖ్యానించింది. "నేను రోజూ ఉదయం వాకింగ్‌కు వెళ్తా. ఎన్నో కుక్కలను చూస్తా"అని అనడంతో కోర్టు కల్పించుకుని "ఉదయపు నడకకు వెళ్లే వాళ్లకు వీధిశునకాల బెడద ఎక్కువ. అందులోనూ సైకిల్, ద్విచక్రవాహనాలు నడిపే వాళ్లకు కుక్కల బెడద మరింత ఎక్కువ. అవి వెంటబడి కిందపడి గాయపడేలాచేస్తాయి. వాటి కారణంగా కిందపడి ప్రాణాలమీదకు తెచ్చుకున్న వాళ్లు ఎంతో మంది ఉన్నారు"అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇదే అంశంలో పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులతో కలిపి ఈ పిటిషన్‌ను తర్వాత విచారిస్తామని కోర్టు తెలిపింది.

## శివన్నగూడ రిజర్వాయర్ ముంపు గ్రామస్థుల ఆందోళన

ప్రాజెక్టు పనులను అడ్డుకున్న చర్లగూడెం వాసులు

ప్రాజెక్టు పూర్తికావొస్తున్నా ఇళ్ల స్థలాలు ఇవ్వడంలేదని ఆగ్రహం




**నల్గొండ, ప్రభాత సూర్య :** మర్రిగూడెం మండలం శివన్నగూడెం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను చర్లగూడెం గ్రామస్థులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ వల్ల చర్లగూడెం గ్రామం మొత్తం ముంపునకు గురవుతుందన్నారు. ప్రాజెక్టు కారణంగా తమ గ్రామం పూర్తిగా మునిగిపోతోందని, పరిహారంగా ఇస్తామన్న ఇళ్ల స్థలాలు ఇప్పటివరకు ఇవ్వలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తికావొస్తున్నా ఇప్పటివరకు స్థలాలు చూపకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు చూపకపోతే పనులు జరగనివ్వబోమని, గడ్డిపోచకూడా తీయనీయబోమని భీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ ఘటనాస్థలికి చేరుకొని నిర్వాసితులతో మాట్లాడారు. ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నిర్వాసితులు ససేమిరా అన్నారు. ఇళ్ల స్థలాలు చూపించాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అధికారులు త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్థులు హెచ్చరించారు.

# పాముకాటు పట్ల అవగాహన అవసరం

పాములు క్రెటేషియస్ కాలం అనగా 150 మిలియన్ సంవత్స రాల పూర్వం బల్లుల నుండి పరిణామం చెందినట్లు భావి స్తారు. సర్పాలకు సంబంధించిన విజ్ఞానాన్ని 'సర్పెంటాలజీ' లేదా 'ఒఫియాలజీ' అంటారు. ప్రతి సంవత్సరం జూలై 16న ప్రపంచ పాముల దినోత్సవం జరుపుకుంటారు. భారత దేశంలో, హిందువులు పాముల్ని నాగ దేవతలుగా పుజిస్తారు. పాములు లేదా సర్పాలు పొడవుగా, పొలుసులు కలిగి, కాళ్లులేని, భూచరాలైన సరీసృపాలు. ఇంతవరకు పాములలో 2,900 జాతులను గుర్తించారు. ఇవి అంటార్కిటికాలో మినహా ప్రపంచ మంతటా విస్తరించి ఉన్నాయి. ఇందులో చాలా వరకు విషపూరితం కావు. మొత్తం ఇరవై కుటుంబాలలో మూడింటికి చెందినవి మాత్రమే హానికరమైనవి. పాములకు చెవులు ఉండవు. భారతదేశంలో అనేక రకాల పాములు ఉన్నా వాటిలో విషపూరిత మయినవి కొన్ని మాత్రమే. ముఖ్యంగా నాగుపాము, రక్త పింజరి, కట్లపాము, రాచనాగులలో విషం ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా 'ప్రతి సంవత్సరం 50 లక్షల మంది పాము కాటుకు గురవుతున్నారు. భారత దేశంలో ప్రతి సంవత్సరం రెండు లక్షల మంది పాటుకాటుకు గురవుతున్నారు. 50వేల మంది మనుషులు పాము కాటు మూలంగా చనిపోతున్నారని అంచనా. ప్రపంచంలో ఒక్క ఐర్లాండ్ దేశంలో మాత్రమే పాములు లేవు. మిగిలిన అన్ని ప్రాంతాల్లో 3 వేల జాతుల పాములున్నాయి. మన దేశంలో ఉన్న 250 జాతులలో 52 విష సర్పాలు. అమెరికా, ఆస్టేలియా, ఇంగ్లండ్ వంటి దేశాల్లో పాము కాటు మరణాలు పదుల సంఖ్యల్లో ఉంటున్నాయి. అతి పొడవైన పాము...అనకొండ, దక్షిణ అమెరికాలోని అనకొండ పొడవు రమారమి 5.5 మీటర్లు. (18 అడుగులు). అతి చిన్న పాము త్రెడ్ పాము...పొడవు 11 సె.మీ. (4.4 అంగుళాలు). వెస్ట్ ఇండీస్ లో కనబడుతుంది. అతి పొడుగాటి కోరలు గల పాము గబూన్ వైపర్... వీటి కోరలు 5 సె.మీ. (2 అంగుళాలు) కంటే ఎక్కువ. అత్యధిక వేగంతో ప్రాకే పాము... ఇది గంటకు 19 కి.మీ. (12 మైళ్ళు) వేగంతో ప్రయాణిస్తుంది. పాములు పూర్తిగా మాంసాహారులు. ఈ పరభక్షకాలు ఎక్కువగా బల్లులు, చిన్న పాములు, జంతువులు, పక్షులు, గుడ్లు, చేపలు, కీటకాలు భుజిస్తాయి. కొన్ని దేశాలలో పాముల్ని ఆహారంగా తింటారు. పాము కాటు వేయటం ద్వారా తన కోరలతో ఏర్పరచిన గాయాన్ని పాముకాటు అంటారు. పాముకాటు విషపూరిత మైనది. అయితే పాము జాతుల యొక్క అధిక భాగం విషపూరితం కానివి ఉన్నాయి. సాధారణంగా ఇవి విషంతో కంటే అదుముట ద్వారా వేటాడిన ఆహారాన్ని చంపుతాయి, విష పూరిత పాములు అంటార్కిటికా మినహా ప్రతి ఖండంలోను కనబడతాయి. పాములు తరచుగా వేట పద్ధతిగా వాటి ఆహారాన్ని కరుస్తాయి, కానీ ఇతర ప్రాణుల నుంచి రక్షించుకునేందుకు తమను వేటాడే వాటిని కూడా కరుస్తాయి. అన్ని పాముకాట్ల యొక్క అత్యంత సాధారణ లక్షణాలు అధిక భయం, కలవరం, మానసిక అస్థిరత్వం, ఈ లక్షణాలు వికారం, వాంతులు, అతిసారం, తల తిరుగుట, మూర్చ, గుండె వేగంగా కొట్టుకోవడం, చల్లని,




తడి గల చర్మం వంటి వాటికి కారణం కావచ్చు. పాము కాటుకు గురైన రోగికి ముందు ధైర్యం చెప్పాలి. విషసర్పం కాటుకు గురైనప్పుడు నోటివెంట నురుగు, చూపు రెండు దృశ్యాలు కనిపించడం, తలనొప్పి, తల తిరుగుడు వం టి లక్షణాలు కనిపిస్తాయి. వీటిని ప్రి పెరాల్టిక్, పెరాల్టిక్ లక్షణాలుగా విభజిస్తారు. ఈ లక్షణాలు కనిపిస్తే రోగికి యాంటీ వెనమ్ డోసు ఇవ్వాలి. చాలా ప్రాంతాల్లో పాము కాటు విషానికి సరైన విరుగుడు చికిత్స అందుబాటులో లేకే బాధితులు పెరుగుతున్నారు. వ్యక్తిని ప్రశాంతంగా ఉంచాలి. తీవ్రమైన ఒత్తిడి చర్యల వలన రక్త ప్రవాహం పెరుగుతుంది, వ్యక్తి దెబ్బతినే ప్రమాదం ఉంది. గాయపడిన వ్యక్తి భయాందోళనలకు, కలవర పాటుకు గురి కాకుండా సానుకూలంగా ధైర్యం చెప్పాలి. రవాణా ఏర్పాట్ల కోసం, సమీపం లోని ఆసుపత్రి అత్యవసర గది కోసం "కాల్ ఫర్ హెల్ప్"కు ఫోన్ చేయాలి. సాధారణంగా అన్ని ప్రాంతాల ఆసుపత్రులలో తరచుగా పాము విషానికి విరుగుడు మందు ఉంటుంది. గుండె, శరీరం యొక్క ఇతర అవయవాలకు పాముకాటుకు గురైన అంగం నుండి రక్త సరఫరాను తగ్గించేందుకు పాముకాటుకు గురైన అవయవము గుండె స్థాయికి క్రింద ప్రయోజనాత్మక స్థానంలో ఉంచేందుకు కచ్చితంగా ప్రయత్నించాలి. అమెరికన్ మెడికల్ అసోసియేషన్, అమెరికన్ రెడ్ క్రాస్ సహా అనేక సంస్థలు పాముకాటును సబ్బు, నీటితో శుభ్రం చేయ వచ్చునని సిఫార్సు చేశాయి. పాముకాటుకు గురైన వ్యక్తికి తినేందుకు లేదా తాగేందుకు ఏమీ ఇవ్వకూడదు. ముఖ్యంగా వినిమయ మద్యం ముఖ్యమైనది. ఇది ఉద్రేకాన్ని పెంచి విషాన్ని రక్తనాళాలలో వేగంగా కలిసేలా చేస్తుంది. ప్రత్యేకంగా వైద్యుని ఆధ్వర్యంలో మినహా ఉత్ప్రేరకాలు లేదా నొప్పి మందులు ఇవ్వకూడదు. కాటుకు గురైన అవయవమును బిగుతుగా చేసి వాపుకు గురి చేయగల వస్తువులను లేదా దుస్తులను తొలగించాలి (వలయాలు, కంకణాలు, గడియారాలు, పాదరక్షలు, మొదలైనవి). సాధ్యమైనంత వరకు వ్యక్తిని మాట్లాడకుండా నిశ్శబ్దంగా ప్రశాంతంగా ఉంచండి. కరచిన చోట కోయ కూడదు. పాము కరచిన చోట ఉన్న గాయంపై ఒక సిరంజిని ఉంచి వాక్యూం పద్ధతి ద్వారా ఆ గాయం నుంచి రక్తాన్ని పీల్చేలా చేసి విషాన్ని తొలగించు కోవాలి.. పాము కరచిన వెంటనే సిరంజి ద్వారా విషాన్ని తొలగించి నట్లయితే గండం గట్టేక్కినట్లే.

# ఆషాడంలో అమ్మవారి బోనం ఎంతో శాస్త్రీయత సంతరించుకుంది-ఆషాఢ మాస విశిష్ఠత

భారతీయుల విశ్వాసంలో శక్తి ఆరాధన అతి ప్రాచీనమైనదీ. అధ్యాత్మిక సంప్రదాయానికి చెందినదీ అని అష్టాదశ పురాణాలు చెబుతున్నాయి. అధ్యంతాలు లేని సృష్టిలో శక్తి పూర్తిగా నిండి ఉంది. రూపంలేని పదార్థానికి రూపాన్ని, జ్ఞానాన్ని ప్రసాదించింది. దేవీ రూపమైన శక్తేననీ, అలాగే ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించే దేవతకూడా శక్తేననీ మానవుడి నమ్మకం శక్తిదేవత మాతృస్వామ్య వ్యవస్థకు ప్రతీక అన్నపానీయుల ప్రసాదించేది ఆ శక్తి దేవతేననీ తైత్తరీమ ఉపనిషత్తు చెబుతోంది. భూమి మీద సమస్త జీవరాశులూ పరాశక్తి ఆధీనంలోనే ఉంటాయి. ఆ శక్తి నుంచే ఆహారాన్నిగ్రహిస్తాయి. ఆ ఆహారానికి ఉన్న ప్రత్యేకతను చాటి చెప్పటానికి పూర్వీకులు నిలిపిన సంప్రదాయమే ఈ బోనం చారిత్రకంగా ఎన్నో ఆధారాలు అజ్ఞాత యుగం నుంచి బోనాలు సంప్రదాయం ఉన్నప్పటికీ ఆరువందల ఏళ్ల నాటి పల్లవ రాజుల శిల్పాలలో సప్తమాతృకలు రూపుదిద్దుకున్న నాటి నుంచీ ఈ సంస్కృతి తెలుగు నేలపై విలసిల్లింది. బోనాల సమర్పణకు అంతటి ప్రాశస్త్యం ఉండడబట్టే పదిహేనో శతాబ్ధంలో శ్రీకృష్ణ దేవరాయలు ఏడుకోళ్ల ఎల్లమ్మ సవదత్తి ఆలయాన్ని నిర్మించి, బోనాలు సమర్పించినట్లు పట్టపురాణి కైఫీయల్ చెబుతోంది. 1676 కరీంనగర్ హుస్నాబాద్‌లో ఎల్లమ్మగుడిని సర్వాయి పాపన్న కట్టించింది. ఆ దేవతను ప్రతిష్టించి బోనాల సమర్పించినట్లు కైఫియతుల్లో గౌడనాడులు గ్రంథం వివరిస్తోంది. 'ప్యాంగం' అనే వ్యవస్థ కోసమే ఏర్పడిందని తెలుస్తోంది. వల్లభరాయుడి క్రీడాభిరామం మాత్రమే కాదు. బోనాలు ఆంగ్లగ్రంథం. తెలంగాణ బోనాలనే తెలుగు గ్రంథాలు బోనాల సంగతులను వివరిస్తున్నాయి. చారిత్రకంగా పరిశీలిస్తే 150 ఏళ్ల కిందట (1868లో) భాగ్యనగరంలోని ప్రజలు మహమ్మారిలా వచ్చి పడిన గత్తర (ప్లేగ్) వ్యాధి నుంచి రక్షించుకోవడానికి గ్రామదేవతలను శాంతింపజేయడానికి చేపట్టిన క్రతువు. పాటించిన నియమాలు భేషుగా ఉన్నాయి. దీనిలో పాలు పంచుకున్న వారందరినీ అభినందిస్తున్నాను అంటూ ఆనాడు ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలో.. ఉర్దూలో ఈ శాసనాన్ని 5వ నిజాం రాజు చెక్కించారు. అలాగే అంటువ్యాధులు సోకినందున 1964లో బోనాలు సమర్పించినటుల లష్కర్ ఉజ్జయినీ మహాంకాళీ ఆలయంలో ఒక శిలాఫలకం ఉంది. తొలి బోనం అక్కడే.. ఈ నెల 26 గురువారం గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలిబోనం సమర్పించక. ఈ ఊరడి ఉత్సవం రాజధాని నగరంలో మొదలవుతుంది. ఆ తరువాతి వారం లష్కర్లో మరో వారం లాల్ దర్వాజాలో ఆ తరువాత ధూళ్‌పేటలో బల్కంపేట ఎల్లమ్మ అలాగే పాతబస్తీ అమ్మవారి ఆలయాల్లో బానాలను ఈ నెల రోజుల్లో సమర్పించుకుంటారు. జగదాంభికా మహాంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తొలి బోనానిన సమర్పించిన తరువాత ఆదివారం నుంచి భాగ్యనగరం అంతటా ఇది ఇంటింటి ఉత్సవంగా మారుతుంది. పట్టు వస్త్రాలు ధరించిన మహిళలు తలపై నైవేద్యం కుండను (బోనం) మోస్తూ అమ్మవారు ఆవహించగా పూనకమూగుతూ డప్పు చప్పుళ్లకు లయ బద్ధంగా నృత్యం చేస్తూ మహాకాళీ ఆలయాలకు చేరుకుంటారు. భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించుకుంటారు. పొరుగు రాష్ట్రాల్లో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమలో ఈ సంప్రదాయం కనిపిస్తోంది. ఆరోగ్యప్రదం కూడా. బోనం కుండలో బియ్యం, పచ్చగూర, బెల్లంవేసి వండడం ఆరోగ్యప్రదం పేడతో కల్లాపి చల్లడం, దర్వాజాలకు వేప మండలు, బోనానికి వేపాకులు కట్టడం,, బోనం ఎత్తుకొన్న వారి చేతిలో వేపమండలు.. ఇవన్నీ రోగనిరోదం కోసమే బోనం మీది దీపం క్రమికీటకాల్ని చంపేస్తుంది. కలుల శఆఖ సమర్పించడంలో ఔషద గుణాలున్నాయి. ఇంకా నమ్మకాయ చలువకు, రక్త శుద్ధికి, పసుపు, కుంకుమలు క్రమిసంహారానికీ దోహదం చేస్తాయి. ఇలా ఆషాఢంలో అమ్మవారి బోనం ఎంతో శాస్త్రీయత సంతరించుకుంది. పల్లెబతుకుల బాగు కోసం శాస్త్రీయ విశ్వాసాలకు పట్టం కట్టి సప్తమాతృకలకు కొలుపులు చేయ డం. బోనాలు సమర్పించడం ఆధ్యాత్మికంగా శాస్త్రీయంగా జాతి ఉన్నతినే చాటి చెబుతోంది. తరతరాలుగా తెలంగాణ జాతీయతను తీర్చిదిద్దడంలో బోనం పాత్రను విస్మరించలేం.

**ఆషాఢమాసం విశిష్టత:** ఆషాఢమాసాన్ని శూన్యమాసం అన్నారు. అందువల్ల వివాహాది శుభకార్యాలు చేయరు. కానీ ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశి విష్ణు ఆరాధనకు అత్యంత ముఖ్యమైన తిథి. దీనికి తొలి ఏకాదశి అని పేరు. ఇక్కడి నుంచి ఇక ప్రతి వారానికి , ప్రతి 15 రోజులకొకసారైనా ఏదో ఒక పండుగ , వ్రతం , పూజ ఉంటుంది. తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతం ప్రారంభిస్తారు. దక్షిణాయనం ప్రారంభమయ్యేది ఈ మాసంలోనే. ఆషాడమాసంలో అందరు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని ఆయుర్వేద శాస్త్రజ్ఞులు చెప్తారు. ఆషాఢ పూర్ణిమే గురు పూర్ణిమ. వ్యక్తికి జ్ఞానజ్యోతిని చూపినవాడు గురువైతే , లోకానికి జ్ఞానరాశిని అందించిన మహానుభావుడు వేదవ్యాసుడు. గురు పూర్ణిమ రోజున వేదవ్యాస మహర్షిని తమ గురువులలో చూసి వారిని ఆరాధిస్తారు. తెలంగాణలో గ్రామదేవతలకు ప్రతి ఇంటి నుంచి వైభవంగా నివేదన(బోనం) తీసుకెళ్ళి అర్పించి బోనాలు మొదలయ్యేది ఆషాఢంలోనే. సమస్త జగత్తుకు పరిపాలకుడైన పూరి జగన్నాధుడి రథ యాత్ర జరిగేది కూడా ఈ మాసంలోనే. అమ్మలుగన్న అమ్మ , ముగ్గురమ్మ మూలపుటమ్మ జగజ్జనీ సకల జీవులకు ఆహారం అందించిన శాకంబరీ దేవిగా దేశమంతటా దర్శనమిచ్చేది ఆషాఢంలోనే. ఈ మాసంలో శాకంబరీ నవరాత్రులు కూడా చేస్తారు. వైఖానస సంహిత ప్రకారం ఈ మాసంలో సప్తమాతృకలు , మహిషాసుర మర్దిని , దుర్గా దేవిని , భైరవ , వరహా , నారసింహుల యొక్క ఆరాధన తప్పక చేయాలి. కొత్తగా పెళ్ళైన వధువును పుట్టింటికి తీసుకువెళ్ళేది ఆషాఢ మాసంలోనే. ఆషాఢమాసంలో కొత్తగా పెళ్ళైన దంపతులను దూరంగా ఉంచుతారు. అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళతారు. ఆషాఢమాసంలో స్త్రీ నెలతప్పితే , 9 నెలల తరువాత అంటే వేసవి కాలంలో(మార్చి నుంచి మే మధ్య కాలంలో) ప్రసవం జరుగుతుంది. సాధారణంగానే మన దేశంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వేసవిలో మరింత విజృంభిస్తాయి. అప్పుడే పుట్టిన శిశువుకు ఈ వేడివాతావరణం బాగా ఇబ్బంది కలిగిస్తుంది. శిశువు ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తుంది. తల్లి ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. అందుకే ఆషాఢమాసంలో కొత్త దంపతులను దూరంగా ఉంచుతారు. మాతశిశు సంక్షేమమే దేశ సంక్షేమానికి తొలి మెట్టు అన్నది మన పూర్వీకులు ఆలోచన. అందుకే ఈ సంప్రదాయం.

ఆషాఢమాసంలో తొలకరి మొదలై వర్షాలు పడతాయి. ఇంట్లో అందరు వ్యవసాయ పనుల మీద పొలానికి వెళ్ళినా , కొత్తగా పెళ్ళైన జంట కలిసి గడపటానికి ఇష్టపడతారు. వ్యవసాయ కుటుంబాల్లో అందరు కలిసి పని చేయకపోతే , చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది. అందుకే కొత్త కోడలిని పుట్టింటికి పంపేస్తారు. కొత్త అల్లుడు అత్తవారింటి గడప తొక్కకూడదన్న సంప్రదాయం కూడా ఇందుకే వచ్చింది. శూన్యమాసం అంటే భయాలను కలిగించేందుకు వచ్చింది కాదు , శాస్త్రీయ కారణాల వల్ల ఆషాడాన్ని శూన్యమాసంగా నిర్ణయించారు పెద్దలు.

ఏ రోజు ఎక్కడ

జూన్ 26-ఆషాఢ బోనాలు ప్రారంభం
జూన్ 26-గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం
జూన్ 29-విజయవాడ కనకదుర్గమ్మకు 2వ బోనం
జూలై 2 బల్కంపేట ఎల్లమ్మకు 3వ బోనం
జూలై 4- జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లకి 4వ బోనం
జూలై 10-సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళికి 5వ బోనం
జూలై 13-సికింద్రాబాద్ లో బోనాల జాతర
జూలై 14- సికింద్రాబాద్ లో రంగం భవిష్యవాణి కార్యక్రమం
జూలై 14-సికింద్రాబాద్ లో సాయంత్రం ఫలహారం బండ్ల ఊరేగింపు
జూలై 15-చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి 6వ బోనం
జూలై 17- లాల్ దర్వాజ అమ్మవారికి 7వ బోనం
జూలై 20-లాల్ దర్వాజ జాతర
జూలై 21-ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు
జూలై 24- ఆషాఢ బోనాల ఉత్సవాలు ముగింపు

-కొలనుపాక కుమారస్వామి
మొబైల్: 9963720669

# కార్పొరేట్ల యుద్ధ లాభాలు

ఏడాదిన్నరకు పైగానే గాజాపై ఇజ్రాయిల్ విరుచుకుపడుతున్నది. ఇప్పటివరకు 85 వేల టన్నుల బాంబులతో ఆ ప్రాంతాన్ని శిథిలాల కుప్పగా మార్చింది. 18 నెలల కాలంలో గాజాపై ఇజ్రాయిల్ జారవిడిచిన బాంబులు హిరోషిమాపై వేసిన అణుబాంబు శక్తి కంటే ఆరు రెట్లు ఎక్కువ. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 56 వేల మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారని గాజా హెల్త్ మినిస్ట్రీ ప్రకటించింది. లక్షలాది మందికి క్షతగాత్రులయ్యారు. గాజా జనాభాలో సగం మంది నిర్వాసితులయ్యారు. వెస్ట్ బ్యాంక్‌లో కూడా వెయ్యి మంది పాలస్తీనియన్లు మరణించారు. అక్రమ సెటిల్ మెంట్ కార్యకలాపాలు, హింస పెరిగాయి. ఈ చర్యలను ఇప్పటికే ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (ఐసీజే) ఆక్షేపించింది. దీన్ని జెనోసైడ్‌గా నిర్ధారించేందుకు అన్ని ఆధారాలున్నాయని చెప్పింది. అయితే ఈ మరణ మృదంగానికి, యుద్ధం దీర్ఘకాలం కొనసాగడానికి కారణాలను చెబుతూ 'ఫ్రం ఎకానమీ ఆఫ్ ఆక్యుపేషన్ టు ఎకానమీ ఆఫ్ జెనోసైడ్' పేరిట యూఎన్ స్పెషల్ రిపోర్టర్ ఫ్రాన్సె స్కా అల్బనీస్ యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు నివేదిక సమర్పించింది. లాభాల కోసం కార్పొరేట్ కంపెనీలు చేసే దురాగతాలను మరోసారి ప్రపంచానికి తెలియజేసింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఐబీఎం వంటి ప్రసిద్ధ కంపెనీలు తమ ప్రయోజనాల కోసం గాజాలో జెనోసైడ్ కొనసాగేలా మద్దతుగా నిలుస్తున్నాయని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఈ సంస్థలు జెనోసైడ్, ఆక్యుపేషన్‌లో పాల్గొంటూ అంతర్జా తీయ చట్టాలను ఉల్లంఘిస్తున్నాయని పేర్కొంది. గాజా సంఘర్షణలో 48కి పైగా కార్పొరేట్ సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొంటున్నట్లు 'ఫ్రం ఎకానమీ ఆఫ్ ఆక్యుపేషన్ టు ఎకానమీ ఆఫ్ జెనోసైడ్' నివేదిక తెలిపింది. ఇందులో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఐబీఎం, పాలంటిర్ టెక్నాలజీస్, లాక్‌హీడ్ మార్టిన్, ఎల్బిట్ సిస్టమ్స్, ఇజ్రాయిల్ ఏరోస్పేస్ ఇండిస్ట్రీస్ వంటి సంస్థలు ఉండడం గమనార్హం. ఈ నివేదిక ప్రకారం 2023 నుంచి టెల్ అవీవ్ స్టాక్ ఎక్స్‌చేంజ్ 213 శాతం పెరిగి, 225.7 బిలియన్ డాలర్ల మార్కెట్ లాభాలను సాధించింది. క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐకు డిమాండ్ పెరగడంతో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు లాభాలు పొందుతున్నాయి. 2023 నుండి ఇజ్రాయిల్ సైనిక వ్యయం 65శాతం పెరిగి 46.5 బిలియన్ డాలర్లకు చేరడంతో ఆయుధ సంస్థలు సైతం లాభాల్లో నడుస్తున్నాయి. ఇజ్రాయిల్ సైన్యం గాజాలో నిఘా, టార్గెటింగ్ కోసం మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ సేవలను వినియోగిస్తున్నది. 2023 అక్టోబర్ నుండి 2024 మార్చి వరకు, అజూర్ ఏఐ సేవల వినియోగం 64 రెట్లు, స్టోరేజ్ సేవలు 60 శాతం పెరిగినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తున్నది. దీంతో 2025 మొదటి త్రైమాసికంలో మైక్రోసాఫ్ట్ 70 బిలియన్ డాలర్ల ఆదాయంతో 18 శాతం లాభాల పెరుగుదలను నమోదు చేసిందని ఫ్రాన్సెస్కా అల్బనీస్ నివేదిక పేర్కొంది. ఇజ్రాయిల్ ప్రభుత్వానికి క్లౌడ్ సేవలు అందిస్తున్న గూగుల్ క్లౌడ్ 2024 చివరి త్రైమాసికంలో 12 బిలియన్ డాలర్ల ఆదాయంతో 30 శాతం పెరుగుదలను, అమెజాన్ వెబ్ సర్వీసెస్ 28 బిలియన్ డాలర్ల ఆదాయంతో 19 శాతం పెరుగుదలను సాధించాయని నివేదికలో పొందుపరిచింది. పాలంటీర్ టెక్నాలజీస్, ఐబీఎం వంటి కంపెనీలు సైతం వివిధ సేవలు అందిస్తూ లాభాలను ఆర్జిస్తున్నట్లు తెలుస్తున్నది. ఎల్బిట్ సిస్టమ్స్, ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండిస్ట్రీస్ యుద్ధం కోసం ఇజ్రాయిల్‌కు డ్రోన్లు, ఆయుధాలను సరఫరా చేస్తూ గణనీయమైన లాభాలు ఆర్జిస్తున్నాయి. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎల్బిట్ సిస్టమ్స్ లాభాలు 18.7 శాతం పెరిగాయి. ఎఫ్-35 ఫైటర్ జెట్లను సరఫరా చేసే లాక్‌హీడ్ మార్టిన్ సైతం లాభాల్లో ఉన్నది. గాజా, వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్ ఇళ్లు, మసీదులు, ఇతర మౌలిక సదుపాయాలను కూల్చి వేయడానికి క్యాటర్ పిల్లర్, వోల్వో వంటి కంపెనీలు భారీ యంత్రాలను సరఫరా చేస్తున్నాయి. బ్లాక్‌రాక్, వాన్‌గార్డ్ వంటి సంస్థలు.. మైక్రోసాఫ్ట్, అమెజాన్, పాలంటిర్, లాక్‌హీడ్ మార్టిన్‌లలో పెట్టుబడులు పెడుతూ ఈ విధ్వంసంలో పరోక్షంగా పాల్గొంటు న్నాయి. ఈ నివేదికను ఇజ్రాయిల్, అమెరికా తిరస్కరించాయి. ఫ్రాన్సెస్కా అల్బనీస్‌ను తొలగిం చాలని యూఎస్ సెక్రెటరీ జనరల్‌ను కోరాయి. అయితే ఇజ్రాయిల్‌తో వ్యాపార సంబంధాలను నిలిపి వేయాలని కార్పొరేట్ కంపెనీలకు ఫ్రాన్సెస్కా అల్బనీస్ సూచించారు. బీడీఎస్ (బైకాట్, డివెస్ట్ మెంట్, శాంక్షన్స్) ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు ఆయా కార్పొరేట్ కంపెనీల ఉత్పత్తులను బహిష్కరిం చాలని ఆమె పిలుపునిచ్చారు.

# భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేసి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్నా పేదలకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా




**బీబీనగర్, జూలై 15( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఐదు మండలలాలో, మూడు పట్టణాలలో కొనసాగుతున్న భూ పంపిణీ నిషేధాన్ని ఎత్తివేసి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్నా పేదలకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం పి.ఆర్.జి ఫంక్షన్ హాల్, బీబీనగర్ లో జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షత జరుగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ హెచ్ఎండిఏ పరధి పేరుతో ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చౌటుప్పల్, పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం, భువనగిరి మండలాల్లో భూ పంపిణీ నిషేధాన్ని పెట్టడం వల్ల అప్పటికే అనేకమంది పేదలు ఆయా మండలాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్నారని అన్నారు. ఆనాటి నుండి నేటి వరకు పలుమార్లు మండల స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టాదారు పాసుబుక్కుల కోసం దరఖాస్తులు పెట్టుకున్న నేటికీ ఎవరు కూడా వారి సమస్యను పరిష్కరించలేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ, జిల్లాలు ఏర్పడ్డ నేటికీ పేదలు సాగు చేసుకుంటున్న భూములకు మాత్రం పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ పంపిణీ నిషేధం ఎత్తివేసి ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్న వారందరికీ వెంటనే పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీబీనగర్ లో ఈనెల 23,24 తేదీలలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిగులు భూములు పేదలకు పంచి పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరుతూ చేపట్టబోయే ఉద్యమాన్ని గురించి చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్. వెంకట్రాములు పాల్గొంటున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జెల్లెల్ల పెంటయ్య, గంగాదేవి సైదులు, జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌలు, జిల్లా సహాయ కార్యదర్శి సిరిపంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ బాలయ్య, బొయ యాదయ్య, దొడ్డి బిక్షపతి, కొండపురం యాదగిరి, బొడ్డు కిషన్, మెతుకు అంజయ్య, గాడి శ్రీనివాస్,మానే సాలయ్య, ప్రసాదం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజాస్వామ్య సెక్యులర్ పార్టీ.

మైనార్టీల అభివృద్ధికి కాంగ్రెస్ పెద్దపీట.

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్.

గ్రంథాలయ సంస్థ చైర్మన్ హాఫీజ్ ఖాన్ కు ఘనంగా సన్మానం.



**నల్గొండ జులై 15. ప్రభాత సూర్య.** నల్గొండ కాంగ్రెస్ ప్రజాస్వామ్య సెక్యులర్ పార్టీ అని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు మంగళవారం నల్గొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు. బిజెపి మతతత్వ పార్టీ అని మైనార్టీలపై దాడులు చేస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. మతాల పేరుతో కులాల పేరుతో రెచ్చగొడుతుందని ఆరోపించారు. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని, ప్రజలు ఎవరు ఆ పార్టీని నమ్మడం లేదని ఎద్దేవ చేశారు. నల్లగొండ పట్టణంలోని దర్గా ఘాట్ రోడ్డుపై రాజకీయాలు చేయవద్దని సూచించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండ పట్టణాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయడం కోసం ఘాట్ రోడ్డుకు నిధులు మంజూరు చేయించాడని పేర్కొన్నారు. దీనిపై ఇతర పార్టీలు రాజకీయం చేయడం సరైన విధానం కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేయడమే కాకుండా రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే సీనియర్ కాంగ్రెస్ నేత అయిన డాక్టర్ హాఫీజ్ ఖాన్ కు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా అవకాశం కల్పించడం జరిగిందన్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి లు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండ పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాడని పేర్కొన్నారు. గతంలో హైదరాబాదులో మత కల్లోహాలు జరిగితే నల్గొండలో కూడా జరిగేవి అని అన్నారు. కోమటిరెడ్డి మంత్రిగా అయిన తర్వాత నల్లగొండలో ప్రశాంత వాతావరణం నెలకొందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు శాంతితంగా ఉంటున్నారని తెలిపారు. ఈమధ్య కొంతమంది మతం, కులం పేరుతో ప్రజల మధ్య గొడవలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఏ సమస్య ఉన్న సామరస్యంగా పరిష్కరించుకొని ముందుకు పోవాలని అన్నారు. ఇప్పటికైనా ఘాట్ రోడ్డుపై అనవసర రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ భావాలు కలిగిన పార్టీ అని, అందుకే ముస్లిం మైనార్టీలంతా మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటున్నారని తెలిపారు విలేకరుల సమావేశం అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నూతనంగా నియమితులైన డాక్టర్ ఎంఏ హాఫీజ్ ఖాన్ ను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రత్యేక ఆహ్వానితులు మహమ్మద్ ఇంతియాజ్ హుస్సేన్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సమద్, ఇంతియాజ్ అలీ, ఆమేర్, ఇబ్రహీం, టీఎస్ మేసా అధ్యక్షులు డాక్టర్ ఏఏ ఖాన్, అజ్జు, షరీఫ్, హైమద్, ఎంఏ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు

# వైశ్య రాజకీయ రణభేరిని సభను విజయవంతం చేయాలి .

## జిల్లా కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ.




**నల్లగొండ జులై 15 ప్రభాత సూర్య :** ఆగస్టు మూడో తేదీన హైదరాబాద్లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్లో నిర్వహించే వైశ్య రాజకీయ రణ బేరిసభను విజయవంతం చేయాలని వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ కాచం సత్యనారాయణ కోరారు .మంగళవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం భవనంలో రణభేరి కి సంబంధించిన పోస్టర్ను ఆయన ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కాచం సత్యనారాయణ మాట్లాడుతూ వైశ్య రాజకీయాలను బేరి సభ వైశ్యుల ఆత్మగౌరవం కోసం వారి హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్నామన్నారు. ఆగస్టు 3న తెలంగాణ జిల్లాలోని అన్ని మండలాల నుంచి వేలాదిగా ఆర్యవైశ్యులు తరలివచ్చి సభను విజయవంతం చేసి తమ సత్తా ఏంటో చూపించాలని కోరారు. ఒకప్పుడు వైశ్యుడు అని గర్వంగా చెప్పుకునే వారమని ఇప్పుడు వైశ్యుడు అంటేనే చిన్న చూపు చూస్తున్నారని తమ ఆత్మగౌరవం కాపాడుకోవడం కోసం వైశ్యులు ముందుకు రావాలన్నారు .వైశ్యుల జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలలో సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు . ఈ డబ్ల్యూ ఎస్ వర్గీకరణ చేయాలని ,వైశ్య కమిషన్ స్థాపించాలని, కులగనన నివేదికలోని అగ్రవర్ణాల వివరాలు కులాల వారిగా ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవులు వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు, వైశ్యులకు ఇరవై ఐదు శాతం సీట్లు కేటాయించాలని విదేశీ విద్యా సహాయ నిధి ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాటు అందించాలని వైశ్య బందును ప్రారంభించాలని డిమాండ్ చేశారు, వైశ్యరాజకీయ రణభేరి సభలో పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చాలని కోరారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యధర్శి లక్ష్మిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అథిదిగా వైశ్యవికాస వేదిక చైర్మెన్ డా కాచం సత్యనారాయణ, గౌ సలహాదారులు కోటగిరి దైవాధీనం, బుక్కా ఈశ్వరయ్య,జిల్లా మహిళ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్యలక్ష్మి, అదనపు ప్రధాన కార్యధర్శి నాళ్ళ వెంకటేశ్వర్లు, యామమురళి పట్టణ అధ్యక్షులు రేపాల బద్రాద్రిరాములు, ఓరుగంటిపరమేశ, నల్లగొండ శ్రీనివాస్, వీరెల్లి సతీష్, గుర్రం పూడ్ మండల అధ్యక్షులు చాణిక్య,కనగల్ మండల అధ్యక్షులు కొత్తమాసు ప్రభాకర్, ఉప్పల కోటయ్య. బికుమల్ల రవిందర్, జానయ్య, కాసంశేకర్, సోమ చంద్రశేఖర్ కాసంశోభారాణి, తల్లం గిరి తదితరులు పాల్గొన్నారు

## సీసీ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభించిన ఉబ్బు వెంకటయ్య



**చౌటుప్పల్.జులై 15. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డు 13,వ వార్డు వెంకటరమణ కాలనీలో మంగళవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య చేతుల మీదుగా సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సారథ్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి వెంకట్రాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, బత్తుల విప్లవ్కుమార్, మోగుదాల రమేష్ గౌడ్, వర్కాల కుమార్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ బొడిగె బాలకృష్ణ, అంతటి బాలరాజ్, సంధగల్ల సతీష్,పాక చిరంజీవి, మాజీ సర్పంచ్ బొంగు జంగయ్య, తూర్పునూరు రవి గౌడ్, ఆంజనేయులు చారి,గోపాల్,గోవింద్,వెంకటేశం,బాబు,రమేష్ గంగారం,నాగేష్ మల్లేష్, శీను తదితరులు పాల్గొన్నారు.

## కామ్రేడ్ గోపగోని సుజాత ఆశయాలను సాధిస్తాం



**చౌటుప్పల్.జులై 15. ప్రభాత సూర్య:** చౌటుప్పల్ మాజీ వార్డు సభ్యురాలు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకురాలు గోపగోని సుజాత మూడవ వర్ధంతిని చౌటుప్పల్ సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్ మాట్లాడుతూ... కమ్యూనిస్టులను విమర్శించడం చాలా సులభం కానీ ఈ కాలంలో కమ్యూనిస్టుగా పుట్టడం, కమ్యూనిస్టుగా మరణించడం, అంటే మహాత్ములతో సమానమని అన్నారు.గోపగోని సుజాత వార్డు సమస్యల మీద అనేక ఉద్యమాలు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించిన గొప్ప మహిళ నాయకురాలని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో గోపగోని లక్ష్మణ్ ని మున్సిపల్ కౌన్సిలర్ గా గెలిచి సిపిఎం పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గా ప్రజలకు అందుబాటులో ఉండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అమరజీవి గోపగోని సుజాత ఆశయ సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం గౌడ్, శాఖ కార్యదర్శి ఎం డి ఖయ్యూం, బండారు నరసింహ, ఉష్కాగుల శ్రీను, బత్తుల దాసు, ఉష్కాగుల రమేష్, మాజీ వార్డు మెంబర్. జట్టంగి కృష్ణ, బత్తుల విప్లవ్, చింతకింది పాండు, సప్పిడి శ్రీనివాసరెడ్డి, బత్తుల రమేష్, ఎండి కాసిం, మహేష్, గంట శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీవోకి వినతిపత్రం అందజేత

-సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి

-డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధు కృష్ణ



**చౌటుప్పల్.జులై 15. ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ ఆరోపించారు. గురుకులాలు,కస్తూర్బా గాంధీ,సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డికి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ మాట్లాడుతూ.. గురుకులాలలో విద్యార్థులకు సంఖ్యానుగుణంగా సిబ్బంది లేకపోవడంతో సమస్యలకు నిలయాలుగా నెలకొన్నాయని, అన్ని రకాల గురుకుల పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని అన్నారు. గురుకులాలు,సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు.అనేక గురుకులాలలో వరుసగా ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ దీనిపై తగు చర్యలు తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరారు. ఆర్డీవో కి మెమోరండం అందించిన వారిలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖాయ్యుమ్, జిల్లా కమిటీ సభ్యులు నత్తి నరేష్, నాయకులు బర్రె రాజు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిగూడ మోడల్ స్కూల్ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్




**మర్రిగూడ: ప్రభాత సూర్య ,** మర్రిగూడ మండలం లోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ జరిగింది, 18 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు ఇందులో 13 మంది విద్యార్థులకు కడుపునొప్పి ముగ్గురికి విరేచనాలు, ఇద్దరికీ వాంతులు అయినట్లు సమాచారం, ఈ ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, రాత్రి మిగిలిన భోజనాన్ని, కోడిగుడ్లను మరుసటి రోజు పిల్లలకు ఇవ్వడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని చర్చించుకుంటున్నారు, ఒకేసారి 18 మంది విద్యార్థి ను లు ఒకేసారి అనారోగ్యానికి గురి కావడంతో మండలంలో హాట్ టాపిక్ గా మారింది ఈ విషయం బయటకి పొక్కకుండా, హాస్టల్ నిర్వాహకులు జాగ్రత్త పడుతూ, నిజాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు

## అమ్మ గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత




**చౌటుప్పల్.జులై 15. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామానికి చెందిన బండ్ల కృష్ణ తన స్వగృహంలో అమ్మ అనే పేరుతో గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ విషయం తెలుసుకున్న పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ భవనంలో చైర్మన్ పాలకూర్ల మురళి మంగళవారం తన చేతుల మీదుగా బండ్ల కృష్ణ స్థాపించిన అమ్మ గ్రంథాలయానికి తన వంతు సహాయంగా 100 పుస్తకాలను బండ్ల కృష్ణ కు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్ల మురళి మాట్లాడుతూ... బండ్ల కృష్ణ అమ్మ గ్రంథాలయాన్ని స్థాపించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని యువత గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిల్లలు చరవాణికి దూరంగా ఉండాలని, పుస్తక పఠణాన్ని అలవాటు చేసుకోవాలని కోరారు. తన ఇంట్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన బండ్ల కృష్ణను అభినందించి మునుముందు తన వంతు సహాయ సహకారాలు గ్రంథాలయానికి అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త దబ్బటి శేఖర్ , సిలువేరు శ్రీనివాస్ , చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత ఈ.ఎన్.టి వైద్య పరీక్షలు




**చౌటుప్పల్.జూలై15. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల్ కేంద్రం, దండుమల్కాపూర్ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఆశ్రయ్ ఆకృతి సంస్థ - కమ్యూనిటీ ఔట్రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించిన ఈ.ఎన్.టి, హియరింగ్, ఇతర వైకల్య స్క్రీనింగ్ వంటి పరీక్షలను విద్యార్థులకు ఉచితంగా అందించారు. క్వాల్కమ్ సంస్థ సహకారంతో క్యాంపులు నిర్వహించి సమస్య గుర్తించబడిన విద్యార్థులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్బర్ పాషా, స్వప్న, ఈ ఎన్ టి స్పెషలిస్ట్ డాక్టర్ ఈ.పద్మజ, %దీష్ట్రుతీస్త్రుజ తీుశీ% ఆడియోలాజిట్ డాక్టర్ భార్గవ్ రావు,మహేష్, మల్టీ డిసిప్లినరీ రెహాబ్ స్పెషలిస్ట్ నరేంద్ర,ఆశ్రయ్ ఆకృతి బృందం ఈ శిబిరంలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ




**చిట్యాల, జూలై 15( ప్రభాత సూర్య):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వనిపాకల చిట్యాల మండలం లో ఈరోజు 2007-08 సంవత్సరంలో పదవ తరగతి చదివిన చిట్యాల లయోలా స్కూల్ పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వనిపాకల విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు బహుకరించారు... ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ బాణాల శీనయ్య చారి మాట్లాడుతూ 2007 8 విద్యా సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు మా పాఠశాలకు వచ్చి మా విద్యార్థులు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయటం వారి సేవా దృక్పథానికి నిదర్శనం ఇలాంటి కార్యక్రమాలు మునుముందు నిర్వహించి పేదవారికి తోడ్పాటు అందిస్తూ ఉండాలని పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు, పాఠశాల విద్యార్థులు కూడా భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉండి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా పెద్ద లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇమ్రాన్, కరుణాకర్, సురేష్, రామకృష్ణ, రాజశేఖర్ రెడ్డి,లవ కుమార్ మరియు ఉపాధ్యాయులు దంతూరి సైదులు, గంపల రవీందర్ రెడ్డి, చొల్లేటి నరసింహ చారి,కవిత, జ్యోతి, నజీరున్నీసా, విజయ, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా ఇస్లావత్ నాయక్

### శుభాకాంక్షలు తెలిపిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



**కూకట్ పల్లి, జులై 15 (ప్రభాత సూర్య) :** మూసాపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కమిషనర్ ఇస్లావత్ నాయక్ ని తెలంగాణ మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం అధ్యక్షులు నీలం చిరు ఆధ్వర్యంలో కలిసి శాలువా కప్పి, పూల మొక్క తో సన్మానించి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ మెడికల్ అధికారి డా.కార్తిక్, శానిటేషన్ సూపర్ వైజర్ జమీల్, సర్కిల్ జవాన్ లు యాదగిరి, పోచయ్య నాయకులు రమేష్, సాయి కుమార్, రూబీన్, వెంకటేష్, పవన్, రాములు, భూపాల్, సుభాష్ గౌడ్, రవి, తదితర ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

# గొర్రెలు,మేకల పెంపకం దారుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**చౌటుప్పల్.జులై 15. ప్రభాత సూర్య :** గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా డైరెక్టర్, జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ పిలుపునిచ్చారు. మంగళవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని వృత్తిదారుల భవనంలో సంఘ సభ్యులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు బండారి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షులు కొండే శ్రీశైలం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... జిఎంపిఎస్ ఆవిర్భావం నుండి గొర్రెలు, మేకల పెంపకం దారుల హక్కుల కోసం సంఘం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేపు జరగబోవు మహాసభలలో గొర్రెలు,మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాకాల పాలను రూపొందిస్తామని అన్నారు. కాబట్టి ఈ నెల 22, 23 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా, రాయగిరిలో జరిగే జిల్లా మూడవ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా సొసైటీ అధ్యక్షులు, జిఎంపిఎస్ జిల్లా, మండల నాయకులు హాజరవుతున్నారు కాబట్టి గొర్రెలు, మేకల పెంపకం దారులు జిల్లా మూడవ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం



చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి ఎం పి ఎస్ మండల అధ్యక్షులు భీమనగొని బాలరాజు యాదవ్, నాయకులు గజ్జి పాండు, ఎర్రగొని మల్లేష్, గిడగోటి జంగయ్య, బెడద రమేష్, బెడద జంగయ్య, అరిగే బీరప్ప, గుణమోని ఐలయ్య పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు అపన్న హస్తం

**లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి**

**కుత్బుల్లాపూర్, జులై 15 (ప్రభాత సూర్య) :** నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కులం హనుమంత్ రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో పలువురు పేదలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించారు. మంగళవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 125 డివిజన్ గాజులరామారం వాసులు ఉంగరాల వెంకటేశ్వర్ రావు కి రూ. 42,500/-, సిరా కేదార్నాథ్ కి రూ 60,000/- , గోమారం జయ లక్ష్మి కి రూ. 47500/- , 127 డివిజన్ గిరి నగర్ వాసులు తసీన్ బేగమ్ కి రూ. 33,500/-, 128 డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్ వాసులు నల్ల అరుణ్ కుమార్ గౌడ్ కి రూ. 42,500/-, 131 డివిజన్ కుత్బుల్లాపూర్ వాసులు పున్న రఘునాథ్ కి రూ. 60,000/- , పరిపటి అజిత కి రూ . 35,000/-, 132 డివిజన్ జీడిమెట్ల వాసులు నారెడ్ల కార్తీక్ రెడ్డి కి రూ. 40,000/-, ఖతీజ బీ కి రూ. 30,000/-, ధమ్మని సత్యనారాయణ కి రూ. 60,000/-, ప్రగతి నగర్ వాసులు కె . శ్రీదేవి కి రూ. 60,000/-,



బౌరంపేట్ మొహమ్మెద్ బిబి కి రూ. 50,000/-, అఖీనబోయిన మాణెమ్మ కి రూ. 60,000/-, మడి ప్రేమలత కి రూ. 60,000/-, దూలపల్లి వాసులు సురుకొంటి శివ రాణి కి రూ. 49,000/-, అడల ప్రకాష్ కి రూ. 60,000/-, బాచుపల్లి వాసులు జెర్మయ్య రామనాథుల కి రూ. 60,000/- , సయ్యద్ అహ్మద్ అలీ కి రూ. 60,000/-, కర్రీ ప్రసన్న కుమార్ కి రూ. 30,000/- ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలను (చెక్కులు) అందజేశారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని అలాగే అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులు రాజకీయ రంగంలో కొత్త ఓరవడికను సృష్టించాలి...






**విద్యార్థులు విద్యార్థి దశనుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి**

**కూకట్ పల్లి ఎస్సై కే నరసింహ**

**కూకట్ పల్లి, జులై 15 (ప్రభాత సూర్య) :** ప్రతి ఒక్క విద్యార్థి, విద్యార్థులు విద్యార్థి దశ నుండి నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని రాజకీయ రంగంలో కొత్త ఓరవడికను సృష్టించాలని కూకట్ పల్లి నారాయణ స్కూల్ ఏజిఎం వేణుగోపాలరావు అన్నారు. కూకట్ పల్లి జోన్ భాగ్యనగర్ కాలనీలోని నారాయణ పాఠశాల (ఈ కే పీ బ్రాంచ్) విద్యార్థుల క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని నాయకులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏ జీ ఎం వేణుగోపాల్ రావు, కే. నరసింహ (కూకట్ పల్లి ఎస్సై) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏ జీ ఎం వేణుగోపాల్ రావు మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి సత్ప్రవర్తన కలిగిన ఉన్నతమైన కొత్త ఆలోచనలతో అన్ని రంగాలలో ముందడుగు వేయాలని తెలిపారు. ఎస్సై నరసింహ మాట్లాడుతూ దేశానికి కావాల్సింది ఉత్తమమైన నాయకులు ఆ నాయకత్వపటిమను విద్యార్థి దశ నుండే




అలవాటు పడాలని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి సుజాత, ఆర్ ఐ కృష్ణ, అకాడమిక్ డీన్ రంజిత్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సుమయ్యా, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన



**చౌటుప్పల్.జులై15. ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం,దండు మల్కాపూర్ గ్రామంలో మంగళవారం జడ్పీ సీఈవో శోభారాణి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ఆమె చేతుల మీదుగా ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం జెడ్పి సీఈవో శోభారాణి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, అధికారులతో కలిసి చెట్లు నాటారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పరిశీలన అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు వారి చేతుల మీదుగా మొక్కలను పంపిణీ చేశారు. ప్రభుత్వ విధివిధానాలకు లోబడి ఇళ్ల నిర్మాణం జరగాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండల అభివృద్ధి అధికారి సందీప్ కుమార్, పంచాయత్ రాజ్ ఇంజనీర్ హరీష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమాదేవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అత్తాపురం భూపాల్ రెడ్డి, ఐకేపీ సభ్యులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిని కలిసిన ఆలూరు సాంబశివారెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను

కృతజ్ఞతలు తెలిపిన ఆలూరు



**అనంతపురం, జూలై 15(ప్రభాత సూర్య):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, అనంతపురం జిల్లా నేత ఆలూరు సాంబశివారెడ్డిని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో పాటు, పార్టీకి చెందిన అన్ని అనుబంధ విభాగాల పర్యవేక్షణ బాధ్యతను తాత్కాలికంగా అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.ఈ నేపథ్యంలో ఆలూరు సాంబశివారెడ్డి తాడేపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి, తనకు ఈ బాధ్యతలను అప్పగించినందుకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. "వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దశ నుంచి నేను జగనన్న పాదయాత్రకు, ప్రజా ఉద్యమానికి భాగస్వామిగా ఉన్నాను. నాకు ఇచ్చిన ఈ నూతన బాధ్యతలు గర్వకారణం మాత్రమే కాదు ౹ పార్టీ పట్ల నా నిబద్ధతను మరింత బలపరిచే బాధ్యతగా చూస్తున్నాను.రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నేను పార్టీని రాష్ట్రవ్యాప్తంగా మున్ముందు బలోపేతం చేయడంలో నిబద్ధతతో పనిచేస్తాను.అలాగే, పార్టీకి చెందిన 30 అనుబంధ విభాగాలపై తాత్కాలిక పర్యవేక్షణ బాధ్యతను నిర్వహిస్తూ, వాటి పనితీరును సమీక్షిస్తూ, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలలో అవి శక్తివంతంగా పనిచేసేలా మార్గ నిర్దేశం చేయడం నా ప్రథమ కర్తవ్యం. ప్రతి విభాగం ౹ యువజన, మహిళ, విద్యార్థి, కార్మిక, రైతు, మైనారిటీ, డాక్టర్లు, ఉపాధ్యాయులు, ఎన్ఆర్ఐలు, తదితర విభాగాలు, ప్రజలతో పార్టీకి అనుసంధానం చేసే వేదికలుగా ఉండాలి.ఇవన్నీ కలసి 2029 ఎన్నికల్లో మా నాయకుడు జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలన్న లక్ష్యం కోసం పనిచేస్తామని ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు.

## బుద్ధునితో నా ప్రయాణం




**నల్గొండ, జూలై 15. ప్రభాత సూర్య** స్థానిక నల్గొండ పట్టణంలో కోటిరెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు బి.ఆర్.అంబేద్కర్ తెలుగు నాటకం బి.ఆర్.అంబేద్కర్ జీవిత వృత్తాంతం ఆధారంగా రూపొందించిన తెలుగు నాటకం. బాల్యం, విద్య, సామాజిక మార్పుకోసం, సాంస్కృతిక మార్పు కోసం, అంబేద్కర్ జీవితంలో ప్రభావం చూపిన ముఖ్యమైన బుద్ధుని రచనలు ఆధారంగా రూపొందించిన నాటకం నిర్వాహకులు బుద్దిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు పరందాములు, సంకు లింగయ్య నామ వెంకటేశ్వర్లు సంకు హరి నూనె విష్ణు మండల ఆంజనేయులు ఏకుల రాజారావు గోలి మల్లేశం జీలుగు రామయ్య లక్ష్మయ్య పంబాల అనిల్ కుమార్ సరిపల్లి అశోక్ మంచాల నర్సింహ జీడికల్లుజి పాలగుడు నాగార్జున కొత్త నగేష్ దొడ్డి కైలాష్ మందుగుల వెంకన్న, సంకు శంకర్ బాజ మనోజ్ గోలి సైదులు అద్దంకి బుచ్చిరాములు మధుసూధన్‌జి వివిధ ప్రజా సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమం బుద్దిస్ట్ సొసైటీ మరియు పిపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించడం జరిగింది

## ఇంద్ర పార్క్ బీసీ ధర్నా చౌక్ లో పాల్గొన్న మాజీ ఎంపీపీ




మర్రిగూడ : ప్రభాత సూర్య మర్రిగూడ మంగళవారం రోజు ఇంద్ర పార్క్ వద్ద బీసీ ధర్నా చౌక్ లో పాల్గొడానికి మర్రిగూడ మండలం బీసీ నాయకులు బయలుదేరారు , బీసీలందరూ ఐక్యతతో ఏకతాటి తో బీసీ ఐక్యతను సాధించాలని ధర్నా చౌక్ లో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగన్, చెరుకు లింగం గౌడ్, శంకర్ యాదవ్, ఐలి నరసింహ, చెరుకు శ్రీరాములు మండల్ నాయకులు పాల్గొనడం జరిగింది

# ఘనంగా టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు





జిహెచ్ఎంసి కార్మికులకు చీరలు, అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేసిన యువనేత గాదే శివ చౌదరి

**కూకట్ పల్లి, జులై 15 (ప్రభాత సూర్య) :** టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, పార్టీ కార్యకర్తలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. యువనేత గాదె శివ చౌదరి ఆధ్వర్యంలో కెపిహెచ్బి కాలనీలో పేదవారికి, అలాగే జిహెచ్ఎంసి లో పనిచేసే కార్మికులకు చీరల పంపిణీ చేశారు. అనంతరం వివేకానంద నగర్ కాలనీలోని రాజేశ్వరి అనాధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివ చౌదరి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ లాంటి వ్యక్తి కూకట్ పల్లి నియోజకవర్గానికి రావటం మనందరి అదృష్టమన్నారు. మన కోసం ప్రతినిత్యం 16 గంటలు పని చేస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తి పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండడానికి కారణం సిగాచి పరిశ్రమలో 52 మంది, అలాగే కల్తీ కల్లుతో 9 మంది మరణించడం. అయినప్పటికీ కూడా వారి అభిమానులు కూకట్ పల్లి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున పుట్టినరోజు కార్యక్రమాలు, సేవ కార్యక్రమాల రూపంలో నిర్వహించడం జరిగింది. ఈ విషయంలో అందరికీ పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. గత ప్రభుత్వం వల్ల మనం ఎలా మోసపోయేమో వివరించారు శివ చౌదరీ. మన భవిష్యత్తు మారాలంటే కార్పొరేటర్ కు, ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెప్పాల్సి%శీ%దే అన్నారు. బండి రమేష్ ని మనం గెలిపించుకోవాలి, అలాంటి నాయకుడు పుట్టినరోజులు వేడుకలలో మేము భాగం అవ్వడం ఆనందంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, టీపీసీసీ సెక్రెటరీ గాలి బాలాజీ, అవనిగడ్డ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మూర్తి, డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నితీష్ గౌడ్, జిల్లా మహిళా జనరల్ సెక్రటరీ జ్యోతి, బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ సంధ్య, వైస్ ప్రెసిడెంట్ కల్పన, బండి సుధా, హరి ప్రసాద్ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, బ్లాక్ మహిళా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# - జులై 22 న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగే పెన్షన్ దారుల సన్నాహక గర్జనను విజయవంతం చేయండి.





- ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ,
- విహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి లోడి ధనుంజయ్య గౌడ్

**ఆత్మకూర్ (యం ), జూలై 15( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆత్మకూర్ (యం ) మండలం సింగారం గ్రామంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి విహెచ్పిఎస్, చేయూత పెన్షన్ దారుల పోరాట సమితి సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం విహెచ్పిఎస్ నాయకులు జామ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎంపీ ఎస్ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, విహెచ్పిఎస్ జిల్లా కార్యదర్శి లోడి ధనుంజయ్య గౌడ్ లు పాల్గొని మాట్లాడుతూ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం వికలాంగులు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, అన్ని రకాలైన ఆసరా పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ జులై 22 న యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లో నిర్వహించ తలపెట్టిన పెన్షన్ దారుల జిల్లా సన్నాహక గర్జనకు పెన్షన్ దారులు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ తెలుగు రాష్ట్రాల్లో పెన్షన్ లు పెరగడం వికలాంగుల హక్కుల పోరాట సమితి,ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటాల ఫలితమే అని,వికలాంగులను ఇంటి వాళ్లే భారంగా భావించి దూరం పెట్టిన వారికి భరోసా గా నేను ఉంటా అని మంద కృష్ణ మాదిగ పెన్షన్ పెరగాలని పోరాటం చేసిన గొప్ప నేత అని, పెన్షన్ లను పెంచాలని ప్రభుత్వం ఇచ్చిన మాట ను నిలబెట్టుకోవాలని మానవతా కోణం లో ఆసరా లేని వారికి అండగా నిలవాలని వారు అన్నారు. ఆగస్టు 13 గర్జన విజయవంతానికి సన్నహాకంగా జులై 22 న యాదాద్రి భువనగిరి జిల్లా లో జరిగే జిల్లా సభ కు వృద్ధులు వితంతులు వికలాంగులు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ప్రతి మానవతా వాది ఈ మానవీయ పోరాటానికి అండగా నిలవాలని వారు అన్నారు. నూతనంగా విహెచ్పిఎస్, వృద్ధుల, వితంతువుల చేయూత పెన్షన్ దారుల పోరాట సమితి నూతన కమిటీలు ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, వీహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి లోడి ధనుంజయ్య గౌడ్, వీహెచ్పీఎస్ - చేయూత పెన్షన్ దారుల సంఘం నాయకులు జామ సుధాకర్, ఎంపీఎస్ నాయకులు మందుల లింగ స్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు మందుల కృష్ణ మాదిగ, బత్తుల స్వామి,కారుపోతుల నర్సింహ్మ,చాట్ల నారాయణ,మందుల రాజయ్య,వాకిటి మల్లా రెడ్డి,మందుల భిక్షపతి,ఎలాకొండ పాండు రెడ్డి,మందుల మల్లయ్య,కొలను చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్లు ఇవ్వకపోతే పనులు జరగనివ్వ





శివన్నగూడ రిజర్వాయర్ పంపు గ్రామస్తులు ఆందోళన

ప్రాజెక్టు పనుల అడ్డగింత

పాజెక్ట్ పూర్తి కావస్తున్న ఇండ్ల స్థలాలు ఇవ్వడం లేదని ముంపు గ్రామస్తుల ఆగ్రహం

**మర్రిగూడ: ప్రభాత సూర్య:** మర్రిగూడ మండలం శివన్న గూడెం బ్యాలెన్స్ రిజర్వాయర్ పనులను చర్లగూడ గ్రామస్తులు అడ్డుకున్నారు రిజర్వాయర్ వల్ల చర్లగూడెం గ్రామం మొత్తం ముంపునకు గురవుతున్నారు, ప్రాజెక్టు కారణంగా తమ గ్రామంలో పూర్తిగా మునిగిపోయిందని, పరిహారంగా ఇస్తామన్న ఇండ్ల స్థలాలు ఇప్పటివరకు ఇవ్వలే దని గ్రామస్తులు ఆరోపించారు ప్రాజెక్టు పూర్తి కావస్తున్న ఇప్పటివరకు స్థలాలు చూపకపోవడం శోచనీయ మనీ మనీ పడ్డారు ఇప్పటికైనా ఇండస్థలాలు చూపకపోతే పనులు జరగనివ్వబోమని, బీస్మించుకొని కూర్చున్నారు, విషయం తెలుసుకున్న చండూరు ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తాసిల్దార్ సంఘటన స్థలానికి చేరుకొని భూ నిర్వాసితులతో మాట్లాడారు

ఆందోళకారులకు నచ్చజెప్పి ప్రయత్నం చేశారు నిర్వాసితులు ససేమిరా అన్నారు, ఇళ్ల స్థలాలు చూపించాల్సిందేనని పట్టుబట్టారు, దీనితో ప్రాజెక్టు పను లు నిలిచిపోయాయి అధికారులు సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు

## అశోక గజపతిరాజు గోవా గవర్నర్గా నియమించడంపై మర్రిగూడ మండల టిడిపి అధ్యక్షుడు హర్షం వ్యక్తం



**మర్రిగూడ: ప్రభాత సూర్య** మర్రిగూడ :కేంద్రం మాజీ మంత్రి టీడీపీ సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్ గజపతిరాజు ను గోవా గవర్నర్గా నియమించడం పై మర్రిగూడ మండల టిడిపి కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు గవర్నర్ నియమించేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి తెలంగాణ తెలుగుదేశం పార్టీ తరఫున మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకన్న యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి పుష్పాల యాదయ్య , మర్రిగూడ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలే మల్లయ్య, మర్రిగూడ గ్రామ శాఖ అధ్యక్షుడు గుణగంటి శ్రీరాములు, సత్తయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు కాసర్ల అంజయ్య, గొల్లపూడి చిన్న, వంగాల సత్యనారాయణ రెడ్డి, వీరమల్ల మల్లేష్, వరికుప్పల శ్రీనివాస్ పాల్గొన్నారు





## అతడి మాటల్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు

తన మాటలు, చేతలతో కాంట్రవర్సీలకు కేరాఫ్ అయిన విజయ్ దేవరకొండ ప్రస్తుతం చాలా సైలెంట్ అయిపోయాడు. మరో 15 రోజుల్లో ఇతడు నటించిన 'కింగ్డమ్' సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నెమ్మదిగా ప్రమోషన్లు మొదలుపెట్టారు. నిర్మాత నాగవంశీ లేటెస్ట్‌గా ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. చిత్ర విశేషాలతో పాటు విజయ్ దేవరకొండని నెటిజన్లు టార్గెట్ చేయడం గురించి కూడా మాట్లాడారు. కారణం లేకుండానే అలా చేస్తున్నారని తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చారు. 'విజయ్ దేవరకొండని అందరూ తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అలానే కారణం లేకుండా అతడిని ఎందుకు టార్గెట్ చేస్తున్నారో నాకు అర్థం కావట్లేదు. 'రెట్రో' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్?లో కావొచ్చు, రీసెంట్‌గా బాలీవుడ్ ఇంటర్వ్యూలో కావొచ్చు.. అతడు మాట్లాడింది వేరే అర్థం వచ్చేలా మార్చేస్తున్నారు' అని నాగవంశీ చెప్పుకొచ్చాడు. విజయ్ దేవరకొండ విషయానికొస్తే కెరీర్ ప్రారంభంలో పెళ్లి చూపులు, అర్జున్ రెడ్డి, గీతగోవిందం తదితర సినిమాలతో సక్సెస్ అందుకున్నాడు. దీంతో తర్వాత సినిమాల ప్రీ రిలీజ్ ఫంక్షన్లలో ఆటిట్యూడ్‌తో మాట్లాడేవాడు. ఈ విషయమై సోషల్ మీడియాలో గట్టిగానే ట్రోల్స్ వచ్చేవి. అందుకు తగ్గట్లు గత కొన్నేళ్లుగా ఇతడు చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాయి. మరీ ముఖ్యంగా గత రెండు చిత్రాలు లైగర్, ఫ్యామిలీ స్టార్ అయితే ఘోరమైన రిజల్ట్ అందుకున్నాయి. అందుకే ఇప్పుడు విజయ్ పూర్తిగా సైలెంట్ అయిపోయాడు. హిట్ కొట్టిన తర్వాత మాట్లాడుదాం అనుకుంటున్నారు. 'కింగ్డమ్'.. జూలై 31న థియేటర్లలోకి రానుంది. మరోవైపు రాహుల్ సంక్రిత్యాన్ తోఓ సినిమా, దిల్ రాజు నిర్మాణంలో 'రౌడీ జనార్ధన్' అని మరో మూవీ విజయ్ దేవరకొండ చేస్తున్నాడు. ఈ మూడు కూడా సక్సెస్ అయితేనే విజయ్ కెరీర్ పరంగా నిలబడతాడు. లేదంటే మాత్రం రేసులో వెనకబడిపోతాడు.

## గ్లామరస్ లుక్‌లో అదరగొడుతున్న శ్రేయా చౌదరి



## ఆర్ఆర్ఆర్ చూసి.. 'వీళ్లతోనేనా నేను యాక్ట్ చేసింది' అని ఫీలయ్యా



జెనీలియా..ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్. ఆమె కోసమే సినిమాకు వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. బాయ్స్, సత్యం, బొమ్మరిల్లు, హ్యాపీ, రెడీ, ఢీ చిత్రాలు సూపర్ హిట్‌గా నిలవడంలో జెనీలియా కీలక పాత్ర పోషించింది. ముఖ్యంగా బొమ్మరిల్లు బ్లాక్ బస్టర్ హిట్ అయిందంటే కారణం.. హాసిని పాత్రలో జెనీలియా కనబర్చిన నటననే. ఇప్పటికీ జెనీలియా అనగానే అందరికి హాసిని పాత్రే గుర్తొస్తుంది. ఆ ఒక్క సినిమాతో జెనీలియా స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. ఆ తర్వాత ఎన్టీఆర్, బన్నీ, రామ్ చరణ్, రామ్ పోతినేని..ఇలా అప్పటి యంగ్ హీరోలందరితోనూ నటించింది. కెరీర్ పీక్స్‌లో ఉండగానే పెళ్లి చేసుకొని సినిమాలకు దూరమైంది. దాదాపు పదమూడేళ్ల తర్వాత మళ్లీ తెలుగు తెరపై కనిపించబోతుంది ఈ అల్లరి బ్యూటీ. ప్రముఖ వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి కుమారుడు కిరీటి రెడ్డి హీరోగా నటిస్తున్న తొలి సినిమా 'జూనియర్'లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా జెనీలియా మీడియాతో మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోలైన ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్‌లపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. వారితో కలిసి నటించినప్పుడు ఇంత గొప్ప స్టార్స్ అవుతారని ఊహించలేదని చెబుతోంది. ఇప్పుడు వాళ్లను స్టార్ హీరోలుగా చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఆర్ఆర్ఆర్ సినిమాలో ఎన్టీఆర్, రామ్ చరణ్‌లను చూసి.. 'వీళ్లతోనేనా నేను నటించాను' అనుకున్నా. ఎన్టీఆర్ చాలా గొప్ప నటుడు అని ఎప్పుడు చెబుతుంటాను. నిజంగా ఆయన సినిమా ఇండస్ట్రీకి ఒక వరం అని చెప్పాలి. మూడు పేజీల డైలాగుని కూడా సింగిల్ టేక్‌లో చెబుతుంటాడు. రామ్ చరణ్ అమెజింగ్. అతనితో కలిసి ఆరెంజ్ సినిమా చేశాను. ఆర్ఆర్ఆర్‌లో ఆయన ఫెర్పార్మెన్స్ బాగుంది. ఇక అల్లు అర్జున్.. చాలా ఎనర్జిటిక్ పర్సన్. హ్యాపీ సినిమా షూటింగ్ సమయంలో ఆయన చాలా హుషారుగా ఉండేవాడు. ఇప్పుడు వీరందరిని పాన్ ఇండియా స్టార్స్‌గా చూస్తుంటే చాలా హ్యాపీగా ఉంది' అని జెనీలియా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల మరణించిన కోటా శ్రీనివాస్‌రావు గురించి మాట్లాడుతూ.. 'ఆయన గొప్ప నటుడు. బొమ్మరిల్లు సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. ఎలా నటించాలో చెప్పేవారు. ఆయనతో కలిసి రెడీ కూడా చేశాను. ఆయన మరణవార్త వినగానే దిగ్భ్రాంతికి గురయ్యాను. అంతగొప్ప నటుడితో స్క్రీన్ షేర్ చేసుకునే అవకాశం రావడం నా అదృష్టం' అని జెనీలియా చెప్పింది.

## వార్2లో ఆ సీన్‌కి బొమ్మ చిరిగిపోవడం ఖాయమట.. నాగ వంశీ కామెంట్స్‌కి అంచనాలు పీక్స్‌కి

ఇండియన్ సినిమా స్థాయిని అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే లక్ష్యంతో యష్ రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న భారీ మల్టీ స్టారర్ చిత్రం వార్ 2. ఇప్పుడు ఈ మూవీ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి తాజా వివరాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తి కాగా, టీజర్ విడుదల తరువాత కొంత మేర నెగెటివ్ రెస్పాన్స్ వచ్చింది. ప్రమోషన్స్ ముమ్మరంగా మొదలవకపోవడం కూడా అభిమానుల్లో నిరాశ కలిగించింది. తాజాగా ఈ సినిమాను తెలుగులో విడుదల చేయనున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీ చేసిన కామెంట్లు మళ్లీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో నాగవంశీ మాట్లాడుతూ, ఎన్టీఆర్ ఇంట్రడక్షన్ సీన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆ సీన్ బాగా వచ్చింది. స్క్రీన్ చిరిగిపోతుంది!" అంటూ ఎన్టీఆర్ మాస్ ఎంట్రీపై భారీ క్రేజ్‌ను క్రియేట్ చేశారు. అభిమానులు ఆ సీన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అంతేకాదు, ఈ సినిమా రైట్స్ ఎందుకు దక్కించుకున్నారనే ప్రశ్నకు ఆయన ఇచ్చిన సమాధానం మరింత ఆసక్తికరంగా ఉంది. "హృతిక్ – ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకుంటారనే ఆలోచనే నాకు బేస్. వారిద్దరి మధ్య వార్ ఎలా ఉంటుందో చూడాలని ఈ సినిమాను తీసుకున్నాను అని నాగవంశీ వెల్లడించారు. ఈ సినిమాకు 'బ్రహ్మాస్త్ర' ఫేమ్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.